RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



08 మే 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:291

అప్పుల బాధతో ఉన్నప్పటికీ సంక్షేమ ఫలాలు అమలు.
పేదవారి కళను నెరవేర్చడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం.

## అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.



వార్తా 2 లో

## ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధంగా ఉండాలి

మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి రేవంత్ రెడ్డి



వార్తా 3 లో

## జిల్లా ప్రజల అభివృద్ధే మా లక్ష్యం... సురేష్ షెట్కర్, జహీరాబాద్ ఎంపీ




వార్తా 9 లో



తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి పరిశీలించారు. నగరంలో నిరంతరం నిఘా కొనసాగించడంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సాగుతున్న పర్యవేక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయడంతో పాటు నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు.

# గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానాన్ని కైవసం చేసుకునే విధంగా పని చేయాలి అబ్జర్వర్ వినోద్ కూమార్








**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**గోషామహల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ డివిజన్ల కార్యకర్తల సమావేశం గాంధీభవన్ లోని ఇందిరాభవన్‌లో నిర్వహించడం జరిగినది .ఈ కార్యక్రమానికి తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమీటీ నియమించిన అబ్జర్వర్లు వినోద్ కూమార్ సౌజన్యగౌడ్ సమక్షంలో నిర్వహించినారు. గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మొగిలి సునీత పాల్గొన్నారు. డివిజన్ల వారిగా వినోద్‌కూమార్ ఆదేశాలతో కార్యకర్తలు తమ బయోడేటాలతో పాటు సమస్యలు తెలియజేశారు. వారివిన్నపాలకు వినోద్‌కూమార్ స్పందిస్తూ ఆవేశాలోద్దు వ్యక్తిగత దుషణలు వద్దు ఎవరైనా మిటీంగ్‌లో గాని వ్యక్తిగతంగా గాని నన్ను సంప్రదించవచ్చు.మీ వినతులను మీ సమస్యలను అదిషాఠనం దృష్టికి తీసుకు వెలుతాను.అబ్జర్వర్లుగా గోషామహల్ నియోజకవర్గంలో మేము పర్యటించి మీ వినతులలో మరియు సమస్యల మాకు తెలిపిన ప్రకారం తెలుసుకోవడం జరుగుతుంది.క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే అదిష్ఠానానికి నివేదిక ఇవ్వడం జరుగుతుంది.సమావేశానికి విచ్చేసినపుడు ఎవరుకాని వ్యక్తులపై ప్రత్యక్షంగా వారితో మాట్లాడి వారిపై ఆరోపణలు చేయకూడదు.అందరు కాంగ్రెస్ పార్టీ నియమనిబంధనలు పాటిస్తూ పార్టీ పటిష్టతకోరకు పని చేసి రానున్న కార్పోరేషన్ ఎన్నికల్లో అన్ని కార్పోరేటర్ సీట్లు విజయం సాధించే విధంగా పనిచేస్తూ గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానాన్ని కైవసం చేసుకునే విధంగా పని చేయాలని అన్నారు.ఏబ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తలు అడిగిన ప్రశ్నకు గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మొగిలి సునీత మాట్లాడుతూ నాకు 20 రోజుల ముందు బీఫాం ఇవ్వడం వలన నియోజక వర్గంలో బూతు స్థాయి కార్యకర్తలను కలవడం కొరకు ఇబ్బంది కలిగింది.కొంత మంది నాయకులు కార్యకర్తలను కలుచుటకొరకు ఇబ్బంది పెట్టినారు.ఈ సమన్వయ లోపాన్ని సరిచేసుకోవల్సిన సమయం వచ్చినది.కొంత మందినాయకులు అవగాహన లేకుంట మాట్లాడుతున్నారు.నేను పుట్టింది గోషామహల్ నియోజకవర్గంలో విద్యాభ్యసం చేసినది గోషామహల్ నియోజక వర్గంలోనే అవగాహన లేకుండా అనవసర మాటాలు మాట్లాడవద్దని అలా మాట్లాడే నాయకులను హెచ్చరించారు.త్వరలోనే ప్రభుత్వ పథకాలలో మనఅందరం పాల్గోందాం.ఈ విషయాన్ని ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్ళినాను అని అన్నారు.అనంతరం వినోద్‌కూమార్ మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పదవులు రద్దయినట్లు ప్రకటించినారు.ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు బండా ఆశోక్ ఖైరతాబాద్ జిల్లా మహిళాధ్యక్షురాలు ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ,డా॥ఆర్పల్లి శ్రీనివాస్ వంజరీ,శ్రీకాంత్ యాదవ్ ,దానరి రాజ్‌కూమార్,సుభాష్ (లడ్డూ) ఎం.శ్రీనివాస్, బి.వెంకటేష్ ,జహంగీర్ ,ఖాదీర్ ,యోగి,రాంబాబు గౌడ్,బి.సతీష్‌గౌడ్, చంద్రమోహన్ యాదవ్,ఆశోక్, తదితరులు పాల్గోన్నారు.

ప్రజాబలం

08 మే 2025 గురువారం

# అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకోవద్దు!

మండు వేసవికాలం. రంగురంగుల మామిడి పండ్లతో మార్కెట్లు కళకళలాడు తుంటాయి. "పళ్లల్లో రారాజు" అని ముద్దుగా పిలుచుకునే ఈపండు కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, ఈమధ్యకాలంలో "అంతా మాయాబజార్" అన్న చందంగా, సహజ సిద్ధంగా కాకుండా కృత్రిమ పద్ధతుల్లో మామిడి పండ్లను త్వరగా పండించేస్తున్నారు. ఇలాంటి "పైపూతలు" పూసిన పండ్ల వల్ల ప్రజల ఆరోగ్యం ఆగమవుతున్నదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన మామిడి పండ్లు మంచివా? లేదంటే కృత్రిమంగా పండించినవా? వాటిని ఎలా గుర్తించాలన్న విషయంలో ప్రజలకు సరైన అవగాహన లేదు. దీంతో అనారోగ్యాన్ని 'కొని'తెచ్చుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బంగనపల్లి, నీలం, రసం, తోతాపురి, బేనిషన్ వంటి రకాలకు మంచి పేరుంది. కానీ, నాసిరకం పండ్లను గుర్తించక అనారోగ్యం బారినపడుతున్నారు. మామిడి కాయలను "నిమిషాల్లో నిప్పులు కక్కేలా" పండించడానికి వ్యాపారులు ఎక్కువగా వాడుతున్న రసాయనం కార్బైడ్, దీనినే కాల్షియం కార్బైడ్ అని కూడా అంటారు. ఇది చూడటానికి పైకి మెత్తగా లోపల వెన్నపూస అన్నట్లు తెల్లగా లేదా బూడిద రంగులో ఉంటుంది. ఈ కార్బైడ్‌ను మామిడి కాయల మధ్యలో పెట్టి నీళు చల్లితే చాలు, అగ్గి రాజుకున్నట్టు ఎసిటిలీన్ అనే వాయువు విడుదలవుతుంది. ఇది సహజంగా పండ్లు పండడానికి కారణమయ్యే ఇథిలీన్ వాయువును పోలి ఉన్నప్పటికీ, అసలు సిసలైంది కాదు, అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ఖర్చు ఎక్కువ లాభం అనే సూత్రంతో నిషేధిత రసాయనమైన ఇథిఫోన్‌ను కూడా అధిక మోతాదులో వాడుతున్నారు. ఈ రసాయనాన్ని మామిడి పండ్లు ముగ్గేందుకు ప్రత్యక్షంగా ఉపయోగిం చడానికి అనుమతి లేదు. ఇది కూడా ఇథిలీన్‌ను విడుదల చేస్తుంది, కానీ దీని అధిక వినియోగం పండ్ల నాణ్యతనుమట్టి కొట్టేలా చేస్తుంది, ఆరోగ్యానికి 'చేటు చేస్తుంది. ఇథిఫోన్‌ను పొడి రూపంలో చిన్న సాచెట్‌లలో ప్యాక్ చేసి పండ్లతో నేరుగా సంబంధం లేకుండా ఉపయోగించవచ్చు. ఈ సాచెట్‌లు ఇథిలీన్ గ్యాస్‌ను విడుదల చేస్తాయి. తద్వారా పండ్లు పండుతాయి. అయితే, ఇథిఫోన్‌ను నేరుగా పండ్లపై చల్లడం లేదా అధిక మోతాదులో ఉపయోగించడం ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిబంధనలకు విరుద్ధం. ఎఫ్ఎస్ఎస్ఎఐ చట్టాల ప్రకారం కాకుండా విరుద్ధంగా వీటిని వాడితే "మూల్యం చెల్లించక తప్పదు". ఈ విషయంలో కోర్టులు కూడా కాల్షియం కార్బైడ్ వాడకాన్ని తీవ్రంగా పరిగణించాయి. ఢిల్లీ హైకోర్టు దీన్ని విషం ఇవ్వడం తో సమానమని "తీర్పు చెప్పింది". ఇతర రాష్ట్రాల కోర్టులు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాయి.

కార్బైడ్, ఇథిఫోన్ వంటివాటితో పండించిన మామిడి పండ్లను తింటే ఆరోగ్యం గుల్లనే అవుతుంది. కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్పరస్ వంటి విషపు కుంపట్లు ఉంటాయి. వీటి ప్రభావంతో తలనొప్పి, కళ్లు తిరగడం, వికారం, వాంతులు, కడుపు నొప్పి, అతిసారం వంటి సమ స్యలు చుట్టుముడతాయి. దీర్ఘకాలికంగా ఇది నాడీ వ్యవస్థను కుప్పకూల్చే ప్రమాదం ఉంది. గర్భిణులు, పిల్లలపై దీని ప్రభావం ఉంటుంది. ఇంకా చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కడుపులో మంట వంటి ఇబ్బందులు కూడా ఉంటాయి. ఇది కాలేయం, మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది.దీన్ని గుర్తించేదెలా?అన్న సందేహం ఎవరికైనా వస్తుంది. సహజంగా పండిన పండ్లు ఒకే రంగులా ఉండదు, అక్కడక్కడ కొద్దిగా ఆకుపచ్చగా ఉంటాయి. కృత్రిమంగా పండించినవి మాత్రం మెరుగు పెట్టినట్టు ఒకే రంగులో మెరిసిపోతుం టాయి. సహజ పండ్లకు నోరూరించే తీయటి వాసన ఉంటుంది, కానీ వీటికి అంత వాసన ఉండదు, లేదా రసాయనాల ముక్కు చీదుకునే వాసన వస్తుంది. సహజ పండ్లు మెత్తగా ఉంటే, కృతిమపండ్లు పైకి మెత్తగా ఉన్నా లోపల రాయిలా గట్టిగా ఉంటాయి. కొన్నిసార్లు వాటిపై నల్లటి మచ్చలు కూడా కనిపిస్తాయి.రుచిలో కూడా తేడా ఉంటుంది, సహజ పండ్లు పూర్తిగా తియ్యగా ఉంటే, వీటికి రుచి అంతగా ఉండదు లేదా పుల్లగా అనిపించవచ్చు. ఒకవేళ మీరు పొర పాటున ఇలాంటి పండ్లను కొంటే, వాటిపై ఉండే రసాయనాలను కొంత వరకు తగ్గించడానికి నీటితో బాగా కడగడం, ఉప్పు నీటిలో, వెనిగర్ లేదా బేకింగ్ సోడా ద్రావణంలో నానబెట్టడం వల్ల ఉపరి తలంపై ఉండే రసాయనాలు కొంత వరకు పనిచేస్తా యి. కానీ పూర్తిగా తొలగించలేమన్నది గుర్తుంచు కోవాలి. అధికారులు కూడా కృత్రిమపండ్లు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్లలో విరివిగా నాణ్యత పరీక్షలు చేయాలి.ప్రజలకు కూడా సరైన అవగాహన కల్పించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యతగా భావించాలి.

# అప్పుల బాధతో ఉన్నప్పటికీ సంక్షేమ ఫలాలు అమలు.

## పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.



**ప్రజా బలం ప్రతినిధి తేది.7.5.2025.** ములుగు జిల్లా. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, పేద వాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

బుధవారం జిల్లాలోని వాజేడు మండలం టేకులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజా, నాగారం నుండి పాయబట్ల వరకు 400 లక్షలు తో బి.టి రోడ్డు నిర్మాణ పనులు, 150 లక్షల అంచనా విలువ తో వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం, ఎడ్చుర్లపల్లి నుండి ముత్తారం వరకు 300 లక్ష తో బి.టి. రోడ్డు నిర్మాణం పనులను శంకుస్థాపనలు, 14 లక్షలతో నిర్మించిన బేబీ బర్త్ వెయిటింగ్ భవనము ను రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరిష్ , ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా లతో కలిసి ప్రారంభించినారు.

అనంతరం కొంగాల గ్రామం 57 మందికి , నాగారం గ్రామం 64 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు.

అనంతరం వెంకటాపురం మండలం కేంద్రం లో అంచనా విలువ 60 లక్షల నిధులతో ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ (పి.ఆర్) కార్యాలయ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా లతో కలిసి శంకుస్థాపన చేశారు.

పాత్రపురం గ్రామంలోని రైతు వైదిక లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు.

ఈ సందర్భంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో మంత్రి పొంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రజలపై పెను భారం మోపిందని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత పాలకులు చేసిన అప్పులు తీర్చడంతో పాటు సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని వివరించారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందని, వాజేడు, వెంకటాపూరం మండలాలలో నిరుపేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈరోజు శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని తెలిపారు.

గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేయడానికి కార్యక్రమాలను చేపట్టిన ఈ సంవత్సరం ఉగాది నుండి ధనికుడు తినే సన్నబియ్యాన్ని పేదలకు అందించాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందజేస్తున్నామని అన్నారు. గతంలో పాలించిన దొర కాలంలో అరకొరగా ఉద్యోగ అవకాశాలు కల్పించగా నేటి ప్రజా ప్రభుత్వం పది నెలల కాలంలోనే 57 వేల 662 ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చి పేద రైతులకు చుట్టంగా మార్చిందని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో రాజీవ్ వికాస్ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని లక్ష్యంతో అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, అర్హులైన వారందరికీ జూన్ 2వ తేదీన ఆరువేల కోట్ల రూపాయలను అందజేయడం జరుగుతుందని అన్నారు. నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు నిరుపేదలు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సేవలు పొందడానికి పది లక్షల రూపాయలను పెంచడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం పేదల పట్ల సవతి తల్లి ప్రేమ కనపరిచినప్పటికీ నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పేదల కన్నీళ్లను చూడచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని, రానున్న రోజులలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగుపరిన అనంతరం నూతన పథకాలను అమలు చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు.

ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం.

భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు.

భద్రాచలం నియోజకవర్గం లోని అన్ని గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు.

బుధవారం వాజేడు, వెంకటాపురం మండలాలలో జరిగిన పలు కార్యక్రమాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఆయన పాల్గొన్నారు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గ్రామాల నిరుపేద ప్రజలకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. తన నియోజకవర్గం పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలలోని అన్ని గ్రామాలలో అన్ని వర్గాల నిరుపేద ప్రజలు ఉన్నారని వారందరికీ దశలవారీగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన నిరుపేదల అందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తాను ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేస్తానని తెలిపారు.

.....ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను త్వరత గతిన పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నదని అన్నారు. వాజేడు మండలంలోని టేకులగూడెం గ్రామంలో 106 ఇల్లు మంజూరు కాగా 62 ఇండ్లు గ్రౌండ్ లెవెల్ లో ఉన్నాయని 15 ఇండ్లు గ్రౌండ్ ఇండ్లు నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు చెల్లించడం జరిగిందని వివరించారు. ఇండ్ల నిర్మాణం కోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వం జిల్లాను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిరుపేదలకు ఐటిడిఏ పరిధిలోని ఆదివాసి గిరిజనులకు ఇండ్ల నిర్మాణం కోసం అదనపు ఇండ్లను కేటాయించిందని అన్నారు.

ఈ కార్యక్రమములలో ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు,

మండల అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి,సమ్మక్క-సారక్క ప్రాజెక్టు లకు నీటి కేటాయింపులు చేపట్టాలి

## -సి.డబ్ల్యూ.సి చైర్మన్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటి





పాలమూరు-రంగారెడ్డితో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు లకు నీటి కేటాయింపులు చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు.

బుధవారం ఉదయం ఢిల్లీలో ఆయన సి.డబ్ల్యూ.సి చైర్మన్ అతుల్ జైన్ తో సమావేశం అయ్యారు.

ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలించుకు పోవడాన్ని నిలువరించాడంతో పాటు పోలవరం బ్యాక్ వాటర్ ల పై ఆయన సి.డబ్ల్యూ.సి చైర్మన్ తో సుదీర్ఘంగా సమావేశమయ్యారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మొత్తం 90 టి.యం.సి ల నీరు కేటాయించాలని అందులో మొదటి దశలో 45 టి.యం.సి ల నీటిని కేటాయించాలని ఆయన కోరారు.అందుకు సంబంధించిన సమగ్ర సనాచారాన్ని సి.డబ్ల్యూ.సి చైర్మన్ కు అందించినట్లు ఆయన వివరించారు. అంతే గాకుండా

ములుగు జిల్లా తుపాకుల గూడెం వద్ద నోర్మితమౌతున్న సమ్మక్క-సారక్క బ్యారేజ్ కి అవసరమైన 44 టి.యం.సి ల నీటి కేటాయింపుల అంశంపై ఆయన చర్చించి అందుకు సంబంధించిన వివరాలను చైర్మన్ కు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగిస్తున్న కృష్ణా జలాశయాల వినియోగం వివరాలు తెలుసు కోవడానికి తక్షణమే టెలిమెట్రి పరికరాలన అమర్చలని ఆయన కోరారు.ఈ పరికరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను తెలంగాణా ప్రభుత్వం ఇప్పటికే కే. ఆర్.యం.బి కి చెల్లించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

పోలవరం బ్యాక్ వాటర్ తో తెలంగాణా ప్రాంతం ముంపుకు గురయ్యే అంశాన్ని ఆయన అతుల్ జైన్ దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు

అతుల్ జైన్ సి.డబ్ల్యూ.సి చైర్మన్ గా మాత్రమే కాకుండా కే. ఆర్.యం.బి చైర్మన్ తో పాటు పోలవరం అథారిటీ చైర్మన్ గా ఉన్నందున అంతరాష్ట్ర జలవనరుల పంపకం పాటు వంటి అంశాలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఎన్.డి.ఎస్.ఏ ఇచ్చిన నివేదికపై ఆయన చర్చిస్తూ మెడిగడ్డ బ్యారేజి మాత్రమే కాకుండ అన్నారం సుందిళ్ళ బ్యారేజిల నిర్మాణంలో ఉన్న లోపాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు అవసరమైన సాంకేతిక నిపుణులను కేటాయించాలని ఆయన ఈ సందర్భంగా సి.డబ్ల్యూ.సి చైర్మన్ ను కోరారు.

# ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధంగా ఉండాలి

## మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**దేశ భద్రతా బలగాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్మీ, పోలీసు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర అత్యవసర విభాగాలతో తాజా పరిణామాలను సమీక్షించిన ముఖ్యమంత్రి ఇలాంటి సందర్భాల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

భారత సైనిక బలగాలకు సంఘీభావంగా, అండగా ఉన్నామని సందేశం ఇవ్వడానికి తెలంగాణ ప్రజల తరపున గురువారం సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. “తీవ్రవాద వ్యతిరేక పోరాటాలకు సంఘీభావ ప్రకటన” గా ఈ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

ఇలాంటి సమయాల్లో రాజకీయాలకు, పార్టీలకు సంబంధించిన వివాదాలకు తావులేదని చెప్పారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆయా విభాగాలకు స్పష్టంగా పలు ఆదేశాలిచ్చారు.

మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలి. ఉద్యోగులంతా అందుబాటులో ఉండాలి. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలి.

వైద్యం, పౌరసరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవల విభాగాలన్నీ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

పరిస్థితిని ఆసరా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసే వారి పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని, సైబర్ సెక్యూరిటీ విభాగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ముఖ్యంగా తప్పుడు సమాచారం వ్యాప్తి జరక్కుండా ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన కఠినంగా వ్యవహరించాలి. ఫేక్ న్యూస్‌ను, పుకార్ల వ్యాప్తిని అరికట్టడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు.

రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలి.

హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సందర్భంగా పీస్ కమిటీలతో సమావేశం కావాలని చెప్పారు. పాత నేరస్తులు, ఇతర నేర చరిత్ర కలిగిన వారిపట్ల పోలీసులు అప్రమత్తంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్మీ, పోలీసు, ఇతర అత్యవసర విభాగాలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్ సక్సెస్

## ఉగ్రవాదులకు కాళరాత్రే

## నిరంతరం పర్యవేక్షించిన ప్రధాని



న్యూఢిల్లీ, మే 7, (న్యూస్ పల్స్) పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం పాకిస్తాన్, పిఓకెలోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం మొదలుపెట్టింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ ప్రతీకాదర దాడులతో పాకిస్తాన్ ఉగ్రవాదులకు నిద్రలేకుండా చేసి కాళరాత్రిని మిగిలిచ్చింది

భారత సైన్యం. పీఓకేలోని మొత్తం 9 ఉగ్ర స్థావరాలు లక్ష్యంగా చేసిన దాడి ఆపరేషన్ సిందూర్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. భారత బలగాలు ఉగ్రవాద స్థావరాలను విధ్వంసం చేయడాన్ని ప్రధాని మోదీ రాత్రంతా నిరంతరం పర్యవేక్షించారని కొందరు అధికారులు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ఏం చేస్తుంది అనే దానికి మంగళవారం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమాధానంగా మారింది. భారత బలగాలు పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు లక్ష్యంగా చేసిన దాడులు విజయవంతమయ్యాయని భారత వర్గాలు వెల్లడించాయి. భారతదేశంలో ఉగ్రదాడులకు ప్లాన్ చేసిన జైషే ఈ ముహమ్మద్, లష్కరే తోయిబా అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ దాడులు చేశాయి. ఉగ్రదాడులను సహించేది లేదని, పహల్గాం దాడికి అంతకు మించి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాని మన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పారు. భారత సైన్యం 9 ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ ఆపరేషన్‌కు సైన్యం 'ఆపరేషన్ సిందూర్' అని పేరు పెట్టింది. రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో కొంతకాలం క్రితం భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించాయని తెలిపింది. ఈ దాడిలో పాకిస్తాన్ సైనిక స్థావరాలకు ఎలాంటి హాని కలిగించలేదని, పాక్ సైన్యాన్ని లక్ష్యంగా చేసుకోలేదని రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. కేవలం ఉగ్రవాద మూలలను మాత్రమే టార్గెట్ చేశామని పేర్కొంది. ఇప్పటికే వాటిని ధ్వంసం చేసే విషయంలో భారతదేశం ఎంతో సంయమనం పాటించింది. పదే పదే పాక్ కవ్వింపు చర్యలను తిప్పే కొట్టేందుకు, పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన ఉగ్ర దాడిలో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ జాతీయుడు మరణించిన నేపథ్యంలో ఇలాంటి కఠిన చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భారత హ్పాం మంత్రిత్వ శాఖ 'ఆపరేషన్ సిందూర్' పై ప్రకటనలో మొత్తం తొమ్మిది ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. మా చర్యలు కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే కేంద్రీకృతమై ఉన్నాయని తెలిపింది. పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని, లక్ష్యాలను ఎంచుకోవడంలో భారతదేశం చాలా సంయమనం పాటించిందని ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ పై ఇండియన్ ఆర్మీ స్పందించింది. న్యాయం జరిగింది అని ఎక్స్ లో పోస్టు చేసింది.

అయితే దాడులు చేపట్టిన ప్రాంతాలకు సంబంధించిన వివరాలను భారత ఆర్మీ ఇంకా వెల్లడించలేదు. మరోవైపు భారత్ లోని శ్రీనగర్, జమ్ము, అమృత్ సర్, ధర్మశాల లేహ్ విమానాశ్రయాలను మూసివేసినట్లు సమాచారం. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం దాడి చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని ఐదు, పాకిస్థాన్ ప్రాంతంలోని నాలుగు ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. సియాల్ కోట్, బహావల్ పూర్, చాక్రా, ముజుఫర్ పూర్, కోట్లీ బంబీర్, చాక్రాఆమ్రూలో జరిగిన దాడుల్లో 30 మంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన తర్వాత రక్షణ మంత్రి ముగ్గురు సైన్యాధిపతులతో చర్చించారు. ఆపరేషన్ సిందూర్ పూర్తయిన తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముగ్గురు సైన్యాధిపతులతో మాట్లాడారు. తదుపరి కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించినట్టుగా సమాచారం.

# భారత్ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది- అసదుద్దీన్



హైదరాబాద్, మే 7,పహల్గాంలో జరిగిన ఉగ్రదాడులకు భారత ప్రభుత్వం ఏం చేస్తుందా అని ఎదురుచూసిన వారికి సమాధానం దొరికింది. గతంలో పుల్వామా ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. రాత్రికి రాత్రే వెళ్లి పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసి ఊహించని విధ్వంసాన్ని వారికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. ఏప్రిల్ 22న పహల్గాంలో మరో భారీ ఉగ్రదాడి జరగగా, అందుకు ప్రతీకారంగా భారత బలగాలు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించాయి. 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి నామరూపాలు లేకుండా చేసి భారత బలగాలు విజయవంతంగా తిరిగొచ్చాయని రక్షణ శాఖ తెలిపింది. భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై నేతలు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై ఏఐఎంఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలపై భారత బలగాలు నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్ ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను. మరో పహల్గాం లాంటి దాడులు జరగకుండా పాకిస్తాన్ ఉగ్రవాదులకు సరైన బదులిచ్చింది మన సైన్యం. మళ్లీ ఉగ్రదాడులు జరగకండా పాకిస్తాన్ కు కఠినమైన గుణపాఠం చెప్పాలి. పాకిస్తాన్ లోని ఉగ్రవాద స్థావరాలతో పాటు వారి మౌలిక సదుపాయాలను పూర్తిగా నాశనం చేయాలి. జై హింద్!” అని అసదుద్దీన్ ఒవైసీ తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ఇటీవల పహల్గాం దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. భారత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తాం అన్నారు. హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, నేతలు, ప్రజలతో కలిసి పహల్గాం ఉగ్రదాడిని నిరిసిస్తూ ఇటీవల నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో అసదుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు. చెప్పినట్లుగానే.. పాకిస్తాన్, పీఓకేలో భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ను ఆయన సమర్థించారు. మరోసారి మనవైపు కన్నెత్తి చూడకుండా పాక్ ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాలన్నారు. భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# విజ్ఞత కోల్పోతున్న ట్రోల్ దాడులు

ాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడిలో భర్తను కోల్పోయిన హిమాన్షి, తండ్రిని కోల్పోయిన ఆరతి మీనన్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వ్యక్తిత్వ హననం జరుగుతున్నది. భర్త వినయ్ నర్వాల్ మృతదేహం ముందు కూర్చుని విలపిస్తున్న హిమాన్షి నర్వాల్ ఫోటో ప్రపంచమంతా వైరల్ అయ్యింది. ఆ ఫోటో ఒక్కటి చాలు! దేశమంతటా ఉగ్రవాద వ్యతిరేకత వెల్లువెత్తడానికి. తండ్రిని కోల్పోయిన కేరళకు చెందిన ఆరతి మీనన్ తన పిల్లలను కాపాడుకున్న తీరు మానవత్వం వున్న ప్రతి ఒక్కరిని కన్నీరు కార్చేలా చేసింది. మన రాష్ట్రానికి చెందిన చంద్రమౌళిని మోకాళ్ళపై కూర్చోబెట్టి భార్య, కూతురు ఎదురుగానే తలలోకి బుల్లెట్లు దించిన తీరును వారు చెబుతుంటే మన ఎదురుగానే జరిగినంత భీతి కలిగింది. ఈ తల్లులు ఇంత శోకంలో కూడా దేశ హితం కోసం ఏది చెప్పాలో, ఏది చెప్పకూడదో విచక్షణతో మాట్లాడారు. శాంతి కావాలి, ఉగ్రవాదాన్ని అంతం చేయండి, చంపిన వారు ముస్లింలే కానీ తిరిగి వెనక్కి రావడానికి సహాయపడిన వారు కూడా ముస్లింలే, కాల్చిన వారి మతాన్ని బట్టి వ్యవహరించకండి.. అని గొప్పగా హితవు పలికారు. మన దేశ గౌరవాన్ని మరో మెట్టు ఎక్కించారు. ఇలాంటి మహోన్నతులపై ఉన్మాదం తలకెక్కిన ముష్కరులు సభ్య సమాజం సిగ్గుపడేలా, నాగరికతను సింధూ నదికి దూరంగా విసిరేసేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. వారు ఉగ్రవాద బాధితులన్న సానుభూతి, మహిళలన్న విజ్ఞత కోల్పోయి నీచాతినీచంగా ట్రోల్ చేస్తున్నారు. హిమాన్షిపై చేసిన ఒక క్రూరమైన పోస్టు ”ఈనీ కూడా చంపితే అప్పుడు సపోర్టు చేసేది తురకలకి”, ”ఇదే తన భర్తను చంపడంలో సహాయం చేసింది”. ఆరతి మీనన్‌పై కూడా ఇలాంటి ఘోరమైన పోస్టులు పెడుతున్నారు. సాయుధ ఉగ్రవాదులు వారి ఆత్మీయులను బలిగొంటే, ఈ సోషల్ మీడియా ఉగ్రవాదులు వారి వ్యక్తిత్వాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని, దేశం పట్ల వారి నిబద్ధతను బలి తీసుకుంటున్నారు. ఉన్మాదం తలకెక్కిన వారి చేతిలో వున్న ఆయుధాలే కాదు, సామాజిక మాధ్యమాలు కూడా మనల్ని బలి తీసుకుంటాయి. వాటి నుండి వచ్చిన తూటాలు శరీరాన్ని ఛిద్రం చేస్తే, వీటి నుండి వచ్చే పోస్టులు మనసును ధ్వంసం చేస్తాయి. వాడు మతాన్ని అడిగి మరీ కాల్చేస్తే, వీడు మానవత్వాన్ని మొలకెత్తకుండా కాల్చేయజూస్తున్నాడు. బయటకు వేర్వేరుగా కనిపించే ఈ ఉగ్రవాదులు నిజంగా వేరు కాదు. వారి లక్ష్యం మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, మత ఘర్షణలు పెట్టడం, ప్రజల ఐక్యతను చీల్చడం. ఏప్రిల్ 22న జమ్ము కాశ్మీర్ పెహల్గాం ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని దేశం యావత్తు నిరసించింది, బాధితులను తమ కుటుంబ సభ్యులుగా భావించి విలపించింది. మతాలకు, ప్రాంతాలకు అతీతంగా దేశమంతటా ఒకే కంఠంతో ఉగ్రవాద చర్యలను ఖండించింది. గతంలో ఎన్నడూ లేనంతగా కాశ్మీర్ ప్రజలు కూడా ఈ అమానుష కాండను తీవ్రంగా వ్యతిరేకించారు. అందరికంటే ముందుగా అక్కడ బంద్ పాటించారు. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలను అక్కున చేర్చుకున్నారు, మనో ధైర్యాన్ని ఇచ్చారు, తక్షణ సపర్యలు చేశారు. గాయపడిన వారిని కిలో మీటర్ల కొద్దీ మోసుకు వచ్చారు. చనిపోయినవారికి మార్చురీ వద్ద ఏర్పాట్లు చేసి శోక హృదయాలతో సాగనంపారు. బాధితులకు ఆశ్రయం ఇచ్చారు. కలిగిన దాంట్లోనే భోజనాలు పెట్టారు. ఉచితంగా ఆటో, ట్యాక్సీల్లో రైల్వేస్టేషన్, విమానాశ్రయాలకు చేర్చారు. ఇలాంటి కొన్ని సంఘటనలు సోషల్ మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిశాయి. బయటకు రాని, రికార్డు కాని అనేక రూపాల్లో స్థానికులు మతం, కులం, ప్రాంతం బట్టి కాకుండా సాటి మనుషులుగా, తమ అతిథులుగా అనుకుని స్పందించారు. మానవత్వంతో, భారతీయులమనే భావనతో చేశారు. వారికి తెలుసు ఉగ్రవాదానికి భిన్నంగా ప్రవర్తించినా, విమర్శించినా జరిగే పరిణామాలు ఏమిటో వారికి అనుభవంలో చాలా తెలుసు, అయినా ఎందుకు స్పందించారు. మేము వారు వేరువేరు, మతం చాటున ఒకే తీరుగా చూడద్దొండి అంటూ పర్యాటకులను వేడుకున్నారు. మనమంతా భారతీయులం అని గొంతెత్తి చాటారు. ఆయుధాలు కలిగిన ఉన్మాదులతో తలపడితే ఏం జరుగుతుందో తెలిసి కూడా సయ్యద్ ఆదిల్ షా ను ఆత్మార్పణకు సిద్ధపడేలా చేసింది ఒకవైపు కాల్పులు జరుగుతుంటే గాయపడిన పిల్లవాడిని 11 కి.మీటర్లకు పైగా వీపున మోసుకుంటూ హుస్సేన్‌ను ఆ కొండల్లో నడిచేలా చేసింది నిజమైన మానవత్వం, అదే నిజమైన భారతీయత. కళ్ళ ముందు తమ వారిని కోల్పోయి దుఖ:ంలో వున్నవారికి ఈ దృశ్యాలు ఎక్కడో జీవితం పట్ల, దేశం పట్ల ప్రేమను, నమ్మకాన్ని నిలిపాయి. అందుకే ఇళ్ళకు తిరిగివచ్చిన బాధితుల్లో ఏ ఒక్కరూ కూడా స్థానిక ముస్లింలను ఒక్క మాట అనకపోగా వారిని అనేక విధాలుగా మెచ్చుకున్నారు.

ఇదే దేశంలోని సామాజిక మాధ్యమాల ముష్కరులకు కోపం తెప్పించింది. ఈ దాడులను ఆధారంగా చేసుకుని హిందూ, ముస్లిం మత ఘర్షణలు పెట్టాలనుకునే వారు విచక్షణ కోల్పోయేలా చేసింది. భర్తలను, తండ్రులను, అన్నలను కోల్పోయిన బాధితులంతా ఉగ్రవాదుల దుర్మార్గాలతో పాటు దేశీయ ముస్లింల మీద ఏదో రూపంలో విరుచుకుపడాలని భావించిన ఉన్మాదుల ఆగ్రహానికి కారణమైంది. హిమాన్షి ఏం మాట్లాడింది! ”నా భర్త ఎక్కడున్నా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని%ॐ%దేశం మొత్తం అతని కోసం ప్రార్థించాలని%ॐ%నేను కోరుకుంటున్నాను. ముస్లింలు లేదా కాశ్మీరీలను ప్రజలు వ్యతిరేకించాలని మేం కోరుకోవడంలేదు. మాకు శాంతి కావాలి, శాంతి మాత్రమే కావాలి. అయితే మాకు న్యాయం కావాలి”. ఈ వాఖ్యలు చేసిన ఆమెలో ఎంతటి స్థిరచిత్తం వుందో, ఎంతటి విజ్ఞత వుందో మెదడు వున్న ప్రతి ఒక్కరిని ఆలోచింపచేసింది. తమ ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు బతకమని ఎన్ని హృదయాలు దీవించాయో! ఈ ఆణిముత్యాలు కొందరికి రుచించలేదు. ద్వేషంతో ఊగిపోయే కషాయ నెటిజన్లు ఆమెపై విరుచకు పడ్డారు. హిమాన్షి జెఎన్‌యు లో చదివిందని, తన భర్త మరణాన్ని సామాజిక, రాజకీయ నిచ్చెన ఎక్కడానికి ఒక అవకాశంగా చేసుకొని ఇలాంటి శాంతి సందేశాలు ఇస్తుందని, కాశ్మీరు హనీమూన్ 'ఆమె ఏర్పాటు చేసిందని' ప్రభుత్వం ఇచ్చే పరిహారం, పెన్షన్ ఆమెకు ఇవ్వకూడదని, ఆమెకు ముస్లిం స్నేహితులు వున్నారని, 'ఆమె జాతి వ్యతిరేకి', 'వారి%ॐ%సానుభూతిపరురాలు' అంటూ తమ చేతికి, నోటికి అడ్డూ అదుపు లేకుండా పోస్టులు పెడుతున్నారు. ఈ దుర్మార్గంపై జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ స్పందించారు. ఇలాంటి పోస్టులు వెంటనే ఆపండి, మహిళకు తన అభిప్రాయాలు, ఆలోచనలు చెప్పే హక్కును కాలరాస్తారా? అంటూ ప్రశ్నించారు. ఏదైనా అంగీకారం లేదా భిన్నాభిప్రాయాన్ని ఎల్లపుడూ మర్యాదగా, రాజ్యాంగ హద్దులకు లోబడి స్పందించాలని చెప్పారు. కేరళకు చెందిన ఆరతి మీనన్ తన పిల్లలను వెంటబెట్టుకుని తండ్రితో కలిసి కాశ్మీరుకు వెళ్లింది. తన తండ్రిని కాల్చవద్దని ఉగ్రవాదులను ఎంతగా వేడుకున్నా కనికరించకుండా అతి సమీపం నుండి ఆయనను కాల్చేశారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయిన ఆరతి మీనన్‌కు ఇద్దరు స్థానిక యువకులు అండగా నిలిచి ఆమె పిల్లలను చేరదీసి, ఆమె తండ్రి శవానికి పరీక్షలు పూర్తి చేయించి, ప్రయాణ ఏర్పాట్లు చేసి పంపారు. కేరళకు తిరిగివచ్చిన ఆరతి స్పందిస్తూ ”ఈ ప్రయాణం నాకు ప్రియమైన తండ్రిని దూరం చేసింది. కానీ ఇద్దరు సోదరులను ఇచ్చింది. ఒకరు డ్రైవర్ ముసాఫిర్, మరొకరు సమీర్. వారు ప్రతి విషయంలో నాకు తోడుగా నిలిచారు. తెల్లవారుజామున మూడు గంటల వరకు నా దగ్గరే వుండి నన్ను ఒక సోదరిగా చూసుకున్నారు” అని చెప్పింది. మతం–ఉగ్రవాదం– మానవత్వం వేర్వేరు అని తన అనుభవం నుండి చెప్పడాన్ని భారత్ మాతా కీ జై అనే వారు సహించలేకపోయారు. ”ఆమె లాంటి పిల్లలు పుట్టడం కంటే లేకుండా వుండటమే మంచిది”, ”ఆమె మాటలు అసహ్యకరం” అంటూ అత్యంత నీచంగా దుర్భాషలాడుతూ పోస్టులు పెట్టారు.

ఇలాంటి పోస్టులు పెడుతున్నవారి ఫేస్‌బుక్ ప్రొఫైల్ ఫోటోల్లో శ్రీరాముడు, ఆంజనేయస్వామి బొమ్మలు, కాషాయ జెండా, అఖండ భారత ఫోటోలు వుంటున్నాయి. ఇంత నీచంగా ట్రోల్ చేసే ధైర్యం వీరికి అక్కడి నుండే అందుతుంది. శీలం, జ్ఞానం, గర్భ సాంస్కారం, హిందూ సంస్కృతి, 'నారీ శక్తి వందన్ చట్టం', బేటీ బచావో' అంటూ చెప్పే మాటలకు వీరి చేతలకు నకశిఖ పర్యంతమంత తేడా వుంది. కాశ్మీర్ దారుణంపై దేశమంతా ఉగ్రవాదం, దానికి ఆధారంగా వున్న పొరుగు దేశంపై ఆగ్రహావేశాలతో వుంటే, ఉగ్ర బాధితులనే బాధించగల వారిని మనుషులు అనగలమా? బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారి విడుదల ఉత్సవాలు, ఉత్తరప్రదేశ్ ఉన్నావోలో దళిత మహిళపై హత్యాచారానికి పాల్పడిన నేరగాళ్ళ ఊరేగింపు, కాశ్మీర్ కథువాలో ఎనిమిదేళ్ళ బాలికను గుడిలో అత్యాచారం చేసి చంపేసిన నిందితులు తల ఎత్తుకుని దేశ పాలకుల పక్కన నిలచిన ఫోటోలు, మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన వీడియోలు దేశమంతా ప్రచారం చేయగలిగే నీచ మనస్తత్వం ఎవరికి వుంటుంది? ఆధునిక సమాజంలో ఉన్నత చదువులు చదివి స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పడానికి ప్రయత్నిస్తున్న అనేక మంది మహిళలు తీవ్రమైన సామాజిక మాధ్యమాల హింసకు గురవుతున్నారు. ప్రముఖ సామాజికవేత్తలు స్వాతి చతుర్వేది, అరుంధతీ రారు, గుజరాత్ ఫైల్స్ రచయిత రాణా ఆయూబ్, తులసీ చందు ఇలా ఒక్కరేమిటి అనేక మంది ఇలాంటి హింసను నిత్యం అనుభవిస్తున్నారు. హత్యాచారాలకు, హత్యలకు పాల్పడే ఉన్మాదులను వ్యతిరేకించినంత మాత్రాన ఈ సమస్య తీరదు. ఇలాంటి వారిని ఎందుకు శిక్షించడం లేదని దేశ పాలకులను ప్రశ్నించాలి. ఇలాంటి వారి వెనుక వున్న మతోన్మాద సంస్థలను నిలదీయాలి. బాధితుల పక్షాన నిలవాలి.

# ఏడేళ్ల తర్వాత డీఎస్సీ

విజయవాడ,మే 7, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 16 వేలకు పైగా ఉపాధ్యాయ కొలువుల భర్తీకి గత నెలలో మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ త్వరలోనే ముగియనుంది. మే 15వ తేదీతో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. మరోవైపు జూన్ 6 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వెలువడిన అతి పెద్ద డీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ ఇదే కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు పోస్టులకు పోటీపడనున్నారు. మొత్తం 16,347 పోస్టులను ఈ నోటిఫికేషన్ కింద భర్తీ చేయనున్నారు. 1994 నుంచి 2018 వరకు తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో స్పెషల్, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్లతో కలిపి మొత్తం 13 డీఎస్సీల ద్వారా ఏకంగా 1.8 లక్షల మంది ఉపాధ్యాయుల నియామకాలను పూర్తి చేశారు.ఏపీలో చివరిగా 2018లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా వెలువడక పోవడంతో దాదాపు ఏడేళ్లుగా అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం పడిగాపులు కాశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పించేందుకు గతేడాది అక్టోబరులో టెట్ కూడా నిర్వహించింది. ఇక 2024 నవంబరులోనే డీఎస్సీ సిలబస్ కూడా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే డీఎస్సీ ప్రకటన జారీ చేయవల్సి ఉండగా.. ఎస్సీ ఉపవర్గీకరణ అమలు నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం నెలకొంది. ఎస్సీ వర్గీకరణ గత నెలలో పూర్తి కావడంతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అలాగే స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచడమే కాకుండా 421 పోస్టులకు తాజాగా డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.మొత్తం పోస్టుల్లో జిల్లా స్థాయిలో 14,088 పోస్టులు, రాష్ట్ర, జోనల్ స్థాయిలో 2,259 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్తులు, పురపాలక, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జువెనైల్ సంక్షేమ పాఠశాలల్లోని ఖాళీలకు జిల్లా స్థాయిలో నియామకాలు చేపట్టనున్నారు. అన్ని రకాల ఎస్జీటీ పోస్టులు 6,599 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 7,487 పోస్టులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 14,088 పోస్టులు ఉన్నాయి. ఇక రాష్ట్ర స్థాయి పోస్టులు 259 ఉన్నాయి. జోన్ 1లో 400, జోన్ 2లో 348, జోన్ 3లో 570, జోన్ 4లో 682 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్తు, పురపాలక పాఠశాలల్లో మొత్తం 13,192 ఖాళీలు ఉన్నాయి. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 881, జువెనైల్ పాఠశాలల్లో 15, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే బధిరులు, అంధుల పాఠశాలల్లో 31 పోస్టులు ఉన్నాయి.

# గిరిజన జాతరకు భారీగా నిధులు

విజయనగరం,మే 7, మన్యం దేవతగా గిరిజనుల దేవతగా పూజలందుకుంటున్న మోదకొండమ్మకు ప్రతి సంవత్సరం మే నెలలో జాతర నిర్వహిస్తారు. ఈ ఏడాది మే 11 నుంచి మూడు రోజుల పాటు జాతర చేయనున్నారు. ఈ మేరకు ఉత్సవ, ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత దీనిని రాష్ట్ర గిరిజన జాతరగా ప్రకటించారు. మొదటి రెండేళ్లు ఏడాదికి 50 లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత ఆ లెక్కను కోటికి పెంచారు.మోదకొండమ్మ జాతర ఏటా మే నెలలో రెండో వారంలో నిర్వహించడం ఆనవాయితీ. విశాఖ పట్టణానికి 120 కిలోమీటర్ల దూరంలో పాడేరులో స్వయంభువుగా వెలసింది అమ్మవారు. మోదం అంటే సంతోషం అని అర్థం. గిరుల్లో వెలసిన దేవత కాబట్టి కొండమ్మ అని కలసి...మోదకొండమ్మ అని పూజలందిస్తున్నారు భక్తులు. ఒడిశా కోరాపుట్ జిల్లాలో నందపురం అనే ప్రాంతం కళింగ దేశంలో ఓ రాజ్యంగా ఉండేది. ఆ నందపురాన్ని రాణి మాకలశక్తి, భైరవుడు పాలించేవారు. వీరికి ఏడుగురు కుమార్తెలు, ఓ కొడుకు. వారిలో మొదటి సంతానమే మోదకొండమ్మ. చిన్నప్పటి నుంచీ మహిమలు చూపే మోదకొండమ్మ మహిషాసుర సంహారం సమయంలో ఆదిపరాశక్తికి సహాయపడిందని పురాణాలు చెబుతున్నాయి. మోదకొండమ్మ మేనత్తకు ఏడుగురు కుమారులు ఉండేవారట. దేశిరాజులుగా పిలచే ఆ ఏడుగురిని మోదకొండమ్మ అక్కచెల్లెళ్లు ఏడుగురు వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత పాడేరులో పినవేనం అనే రాతి గుహ వద్ద స్వయంభువుగా కొలువుదీరిందనీ...మోదకొండమ్మ చెల్లెళ్లు కూడా వివిధ ప్రాంతాల్లో వెలిశారని కథనం. కొన్నాళ్లక్రితం ఇక్కడ ఏటా ప్రత్యేక పూజలు చేసేవారు. ఓసారి పూజల అనంతరం అంతా వెళ్లిపోయాక మోదకొండమ్మ తన చెల్లెళ్లతో కలసి విందు ఆరగిస్తోందిట. ఆ సమయంలో పూజారి వెనక్కు వెళ్లాడు. అంతదూరం తిరిగి వచ్చిన పూజారిని చూసి మోదకొండమ్మ...తన దర్శనం కోసం ఇంత దూరం ఎవరూ రావొద్దని చెప్పి...ఈ చెంబు పడేచోట తాను కొలువై ఉంటాయనని విసిరిందట. ఆ చెంబు పడిన చోట అమ్మవారి పాదాలు కనిపించడంతో వాటినే ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు భక్తులు.ఆ తర్వాత కాలంలో తహసిల్దార్ దాసరిశర్మ అనే భక్తుడి కలలో అమ్మవారు కనిపించడంతో పాడేరులో ఆలయం నిర్మించారని కథనం.ఏడాది మొత్తం విశేష పూజలు నిర్వహించి ఏడాదికోసారి మే నెలలో మూడు రోజుల పాటు వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా భారీగా తరలివస్తారు. మొదటి రెండు రోజులూ స్థానిక సతకంపట్టు వద్ద అమ్మవారి ఘటాలను మేళతాళాలతో తీసుకొచ్చి పెడతారు. వాటిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు భక్తులు. సాయంత్రం ఆ ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. మూడో రోజు తెల్లవారుజామునుంచే మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు బారులు తీరుతారు. విశేషమైన పూజలు, ఊరేగింపులతో ఉత్సవాలు ముగుస్తాయి. విశాఖ వరకూ ట్రైన్ లేదా బస్సులో చేరుకుంటే అక్కడి నుంచి మోదకొండమ్మ ఆలయానికి బస్సులు, ప్రేవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి.జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో ఏర్పాట్ల ఖర్చు కూడా పెరుగుతోంది అంటున్నారు నిర్వాహకులు. అందుకే ప్రభుత్వం ఇస్తున్న కోటి రూపాయల నిధులను మూడు కోట్లకు పెంచాలని స్థానిక అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

# జూన్ 1 నుంచి విమాన సేవలు

విశాఖపట్టణం, మే 7,ఏపీకి రాజధానిగా అమరావతి ఉంది. అమరావతి పునర్నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మరో మూడేళ్లలో ప్రజా రాజధాని అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. మరోవైపు విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. అందులో భాగంగా దిగ్గజ పారిశ్రామిక సంస్థలు విశాఖలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ సంస్థలు పెద్ద ఎత్తున కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. ఈ తరుణంలో విజయవాడ నుంచి విశాఖకు రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయి. రోడ్డు మార్గంలో వెళ్లాలంటే సమయం పడుతుంది. రైలు మార్గంలో కూడా జాప్యం జరుగుతోంది. మరోవైపు విజయవాడ నుంచి విశాఖకు నేరుగా విమాన సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత కొద్దిరోజులుగా దీనిపై విమర్శలు వస్తుండడంతో కేంద్ర పౌర విమానయాన శాఖ దృష్టి పెట్టింది. రెండు నగరాలను కలుపుతూ విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు.విజయవాడ నుంచి విశాఖకు వెళ్లాలంటే.. చెన్నై నుంచి వచ్చే ఒకే విమానం అందుబాటులో ఉంది. అందుకే దానికి విపరీతమైన రద్దీ ఉంటుంది. దీంతో చాలామంది హైదరాబాద్ కు వెళ్లి.. అక్కడి నుంచి విశాఖకు చేరుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమాన సర్వీసులపై ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సైతం దీనిపై ఆవేదన వ్యక్తం చేశారు. పౌర విమానయాన సర్వీసులపై విమర్శలు రావడంతో సంబంధిత శాఖ దృష్టి పెట్టింది. విజయవాడ నుంచి విశాఖకు నేరుగా విమాన సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు నిర్ణయించింది. ఈ నిర్ణయం పై విమాన ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కొత్త విమాన సర్వీసులపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకీలక ప్రకటన చేశారు. జూన్ 1 నుంచి కొత్త విమాన సర్వీసును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇండిగో సంస్థ ఆధ్వర్యంలో నడిచే ఈ విమానం ఉదయం ఏడు గంటల 15 నిమిషాలకు విజయవాడలో బయలుదేరుతుంది. ఎనిమిది గంటల 25 నిమిషాలకు విశాఖ చేరుకుంటుంది. తిరిగి ఉదయం 8 గంటల 45 నిమిషాలకు విశాఖ నుంచి బయలుదేరుతుంది. 9 గంటల 45 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ నూతన విమాన సర్వీసు తో విజయవాడ నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులకు కొంతవరకు రవాణా భారం తగ్గనుంది.ఇప్పటివరకు చెన్నై నుంచి విశాఖ వెళ్లే విమాన సర్వీస్ మాత్రమే అందుబాటులో ఉండేది. చెన్నై నుంచి ఉదయం ఎనిమిది గంటల ఐదు నిమిషాలకు విజయవాడ వచ్చే ఈ విమానం.. 8 గంటల 45 నిమిషాలకు విశాఖ బయలుదేరేది. కానీ చెన్నై నుంచి విమానంలో రద్దీ ఎక్కువగా ఉండేది. దీంతో ఎక్కువమంది హైదరాబాద్ మీదుగా విశాఖకు చేరుకునేవారు. ఇప్పుడు ఈ ఇబ్బందులు తొలగనున్నాయి. విజయవాడ నుంచి ఉదయం విశాఖ కు వెళ్లి.. పనులు చూసుకుని రాత్రికి అందుబాటులో ఉండే విమానాల్లో తిరిగి విజయవాడకు చేరుకోవచ్చని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పౌర విమానయాన శాఖ నిర్ణయం పై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ లో ఒక పోస్ట్ పెట్టారు.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్..

## 23 మంది మావోయిస్టుల హతం..!

కొత్తగూడెం మే 7 : తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. వివరాలు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో గత రెండు వారాల పైగా వేల సంఖ్యలో భద్రతా దళాలు మావోయిస్టుల వేటలో నిమగ్నమైన విషయం విదితమే. ఈ క్రమంలోనే ఇప్పటివరకు సుమారు పదిమంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.కాగా తాజాగా బుధవారం ఉదయం బీజాపూర్ జిల్లాలోని కర్రెగుట్ట ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారాసపడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఇప్పటివరకు 23 మంది మావోయిస్టులు నేలకొరిగినట్లు సమాచారం. కాగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతిమ లక్ష్యంగా జరుగుతున్న ఆపరేషన్ "కగార్" స్వల్ప విరామం తర్వాత తీవ్ర రూపం దాల్చింది. ప్రస్తుతం జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు భారీ సంఖ్యలోనే మృతి చెందారు అన్న వార్తలు వినవస్తున్నాయి. అయితే డ్రోన్ కెమెరాల సహాయంతో మావోయిస్టుల కదలికలను పసిగట్టి కాల్పులకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.

# జగన్ 2.0 పాదయాత్ర...



విజయవాడ, మే 7, వైఎస్సార్ కాంగ్రెస్అధినేత జగన్మోహన్ రెడ్డి మరోసారి పాదయాత్ర చేస్తారా? పాదయాత్రతో ప్రజల మధ్యకు వెళ్తారా? రెండోసారి ఆయన పాదయాత్ర చేస్తే ప్రజలు ఆదరిస్తారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే ఆసక్తికర చర్చ. త్వరలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేయబోతున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రకటించారు. విశాఖలో జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో గుడివాడ అమర్నాథ్ ఈ ప్రకటన చేశారు. అయితే ఆయన యధాలాపంగా ఈ ప్రకటన చేశారా? లేకుంటే నిజం తెలిసి మాట్లాడరా? అన్నది తెలియాల్సి ఉంది. నేతల పాదయాత్రతో ఆ పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫార్ములాను ఎంచుకున్నారా అన్న అనుమానం కలుగుతోంది.2003లో ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాదయాత్ర చేశారు వైయస్ రాజశేఖర్ రెడ్డి.దశాబ్ద కాలం పాటు అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీని విజయ బాట పట్టించారు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి రావడానికి కారణమయ్యారు. 2014 ఎన్నికలకు ముందు సుదీర్ఘ పాదయాత్ర చేశారు టిడిపి అధినేత చంద్రబాబు. ఆ ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు కారణమయ్యారు. 2018లో పాదయాత్ర చేశారు జగన్మోహన్ రెడ్డి. 2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి కారణమయ్యారు. 2023లో పాదయాత్ర చేశారు నారా లోకేష్. దీంతో 2024 టిడిపి అధికారంలోకి వచ్చేందుకు కారణమయ్యారు. అందుకే ఈ పాదయాత్ర ఫార్ములాను అనుసరించి 2029 ఎన్నికల్లో గెలవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. 2024 ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. కనీసం ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా రాలేదు. కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. పార్టీ నుంచి నేతలు బయటకు వెళ్లిపోయారు. చివరకు పార్టీలో నెంబర్ 2 గా ఉన్న విజయసాయిరెడ్డి లాంటి నేతలు సైతం తమ దారి తాము చూసుకున్నారు. పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. మరోవైపు కూటమి ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ నేతలను టార్గెట్ చేస్తోంది. ఈ క్రమంలో పార్టీని బలోపేతం చేయడం కంటే పార్టీని కాపాడుకోవడం జగన్మోహన్ రెడ్డి ముందున్న కర్తవ్యం. అందుకే ఆయన తప్పకుండా పాదయాత్ర చేస్తారని పార్టీ శ్రేణుల నమ్మకం. అందులో భాగంగానే గుడివాడ అమర్నాథ్ ప్రకటన చేసి ఉంటారన్నది ఒక అనుమానం.అయితే రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది మొదలు జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగళూరుకి పరిమితం అవుతున్నారు. కనీసం ప్రజల మధ్యకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు. మొన్న మధ్యాహ్నం పార్టీ శ్రేణుల పరామర్శకు వచ్చారు. జైల్లో ఉన్న నేతలను పరామర్శించారు. గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లారు. అక్కడ రైతులతో మాట్లాడారు. అంతకుమించి ఆయన ప్రజల మధ్యకు వచ్చింది లేదు. జిల్లాల పర్యటనకు వెళ్తానని ఆరు నెలల కిందట ప్రకటించారు. కానీ అది ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. అందుకే పాదయాత్ర పై అనుమానాలు ఉన్నాయి. పైగా ఇదివరకు చేసి ఉండడంతో.. ఆ స్థాయిలో ప్రజల నుంచి ఆదరణ వచ్చే అవకాశం లేదు. పైగా కూటమి ప్రభుత్వం నుంచి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే పాదయాత్ర బదులు బస్సుయాత్ర , జిల్లాల పర్యటనకు ఎక్కువగా ఆయన మొగ్గు చూపే అవకాశం ఉంది.

# బీజేపీ, జనసేనలతో కూటమా...

విజయవాడ, మే 7,జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు బీజేపీ కేంద్ర నాయకత్వం పెద్ద బాధ్యతలను అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. జనసేనలో ఉన్నప్పటికీ బీజేపీ పెద్దలు పవన్ పై ఎన్నో ఆశలు పెంచుకున్నారు. ముఖ్యంగా దక్షిణాదిన పవన్ కల్యాణ్ ను వచ్చే ఎన్నికల నాటికి ఉపయోగించుకోవాలని కేంద్ర నాయకత్వం భావిస్తుంది. దక్షిణాదిన బీజేపీకి సరైన ఇమేజ్ ఉన్న నేతలు లేరు. కర్ణాటకలో యడ్యూరప్ప మొన్నటి వరకూ ఉన్నా ఆయన రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకున్నారు. ఇక కర్ణాటకలో బీజేపీకి సరైన నేత లేరు. తమిళనాడు లోనూ బీజేపీని గెలిపించగల లీడర్ అంటూ కరువయ్యారు. కేరళ రాష్ట్రంలోనూ అదే పరిస్థితి. తెలంగాణలో నేతలు బలంగా ఉన్నప్పటికీ ఇమేజ్ ఉన్న నాయకుడు లేరు. ఆంధ్రప్రదేశ్ లోనూ సరైన నాయకత్వం లేదు. క్రౌడ్ పుల్లర్ లీడర్... అయితే దక్షిణాది రాష్ట్రంలో క్రౌడ్ పుల్లర్ గా ఒక నేత కావాలని బీజేపీ భావిస్తుంది. అందుకు పవన్ కల్యాణ్ ను ఎంచుకుంది. దక్షిణాదిన పవన్ చరిష్మాను ఉపయోగించుకోవాలని బీజేపీ బలంగా భావిస్తుంది. జనసేనలో ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్ బీజేపీ కేంద్ర నాయకత్వం మాట జవదాటరు. వారిని కాదని పవన్ కల్యాణ్ ముందుకు అడుగు కూడా వేయరు. పవన్ కల్యాణ్ కు కూడా బీజేపీ కేంద్ర నాయకత్వం అంతే ప్రాధాన్యత ఇస్తుంది. ఢిల్లీకి తరచూ వెళ్లకపోయినప్పటికీ మోదీ, అమిత్ షాలు ఆయనతో టచ్ లో ఉంటారు. పవన్ కల్యాణ్ కూడా సనాతన ధర్మం నినాదం ఎత్తుకోవడం వెనక బీజేపీ డైరెక్షన్ ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. హిందూధర్మాన్ని ఆయన భుజానకెత్తుకున్నారు.. ఇక మోదీ ఇక్కడకు వచ్చినా, పవన్ కల్యాణ్ మోదీ సభకు వెళ్లినా పవన్ కల్యాణ్ ను ప్రత్యేకంగా పలకరిస్తారు. ఆయనకు ప్రత్యేకించి గౌరవం ఇవ్వడం వెనక కూడా ఇదే అంటున్నారు. తాజాగా అమరావతి రాజధాని పనుల పునర్నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా జరిగిన సభలోనూ పవన్ కల్యాణ్ ను మోదీ ప్రశంసలతో ముంచెత్తారు. అంతేకాదు పవన్ కల్యాణ్ పై ప్రత్యేకంగా ఆప్యాయతను ప్రదర్శించారు. చాక్లెట్ ఇచ్చారని కొందరు విమర్శలు చేస్తున్నప్పటికీ పవన్ కల్యాణ్ ను సోదరుడుగా సంభోదిస్తూ మోదీ చేసిన ప్రసంగంతోనే ఆయనకు ఇచ్చిన విలువ అర్థమవుతుంది. మోదీ పవన్ కల్యాణ్ ను యువనేతగా అభివర్ణిస్తూ జనసేన క్యాడర్ కు మంచి కిక్కు అందించారు. వచ్చే ఏడాది తమిళనాడు ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. అక్కడ పళనిస్వామిని ముఖ్యమంత్రిగా ప్రకటించింది. అయితే అక్కడ బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు పవన్ కల్యాణ్ ను ఉపయోగించుకోనుంది. పవన్ కల్యాణ్ కు కీలక బాధ్యతలను అప్పగించే యోచనలో కేంద్ర నాయకత్వం ఉంది. రానున్న తమిళనాడుతో పాటు భవిష్యత్ లో కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లోనూ పవన్ సేవలను ఉపయోగించుకోవాలని డిసైడ్ అయినట్లు సమాచారం. మొత్తం మీద బీజేపీ పవన్ కల్యాణ్ కు ఇస్తున్న ప్రయారిటీ చూసి కూటమిలోని కొందరు నేతలకు కన్ను కుడుతున్నా ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు.

# నార్త్ లో పలు విమానాశ్రయాలు మూసివేత

న్యూఢిల్లీ, మే 7, (న్యూస్ పల్స్) పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ కు శ్రీకారం చుట్టాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 9 ఉగ్రవాద స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేసింది. ఈ క్రమంలో పాకిస్తాన్, భారత్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలతో బుధవారం ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలలోని విమానాశ్రయాలు మూసివేయనున్నారు. ఈ మేరకు విమాన ప్రయాణికులకు ఎయిర్ లైన్స్ సంస్థలు సూచనలు చేస్తున్నాయి.ధర్మశాలతో పాటు లేహ్, జమ్మూ, శ్రీనగర్, అమృత్‌సర్‌తో సహా పలు విమానాశ్రయాలు తదుపరి నోటీసు వచ్చే వరకు మూసివేసి ఉంటాయని స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఒక పోస్ట్‌లో తెలిపింది. ఈ సమయంలో రాకపోకలు చేసేవారు ఈ విషయాన్ని గమనించాలని సూచించింది. పలు విమానయాన సంస్థలు ఇదివరకే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణీకులు ప్రస్తుత పరిణామాలు గమనించి ప్రయాణాన్ని తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని చెబుతున్నాయి.భారత బలగాల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తరువాత కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ధర్మశాల , లేహ్, జమ్మూ , శ్రీనగర్, అమృత్‌సర్ సహా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలోని విమానాశ్రయాలు తాత్కాలికంగా మూసివేశారు. తదుపరి నోటీసు వచ్చే వరకు అవి సేవలు అందించవని అధికారులు స్పష్టం చేశారు. వీటి కారణంగా ప్రస్తుత రాకపోకలకు టికెట్లు బుక్ చేసుకున్న వారి జర్నీ ప్రభావితం కావచ్చు. ప్రయాణీకులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవడమే, లేక ప్రత్యామ్నాయం ప్లాన్ చేసుకోవాలని ఎయిర్ లైన్స్ సంస్థల ప్రతినిధులు సూచించారు. దేశంలోని ఎంపిక చేసిన నగరాలకు, అక్కడి నుండి బయలుదేరే ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణికులకు విమాన ప్రయాణానికి సంబంధించి అడ్వైజరీ జారీ చేసింది. శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాలకు వెళ్లేవారు, అక్కడి నుండి బయలుదేరే విమాన సేవలు అందుబాటులో లేవని ఎక్స్ ఖాతాలో తెలిపింది. విమానాశ్రయానికి చేరుకునే ప్రస్తుత స్థితిని తనిఖీ చేసుకోవాలని విమానయాన సంస్థలు తమ ప్రయాణికులను కోరాయి."మారుతున్న పరిస్థితుల కారణంగా శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాలకు వెళ్లేవారు.. అక్కడి నుంచి బయలుదేరే మా విమానాలు ప్రభావితం అయ్యాయి. ఈ ఎయిర్ పోర్టులు మూసివేడంతో ప్రస్తుతం విమాన ప్రయాణాలు సాధ్యం కాదని, దయచేసి ఈ విషయాన్ని గమనించాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము" అని ఇండిగో పోస్ట్ చేసింది. గగనతల పరిమితుల వల్ల బికనీర్‌కు వెళ్లే, అక్కడి నుండి బయలుదేరే విమానాలు సైతం అందుబాటులో లేవు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి అర్థం చేసుకోవాలని సూచించారు.పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై "ఆపరేషన్ సిందూర్"లో భాగంగా ఈ దాడులు చేసింది భారత సైన్యం. విజయవంతగా భారత బలగాలు తమ టార్గెట్ పూర్తి చేశాయని, ఎలాంటి సైనిక స్థావరాల జోలికి వెళ్లలేదని భారత రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. అందుకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ కు శ్రీకారం చుట్టి తమ సత్తా చాటింది.

# వెలుగులోకి పెద్దిరెడ్డి అక్రమాలు

## కలకలం రేపుతున్న బుగ్గమఠం ఆక్రమణలు

తిరుపతి, మే 7,రుపతి నగరంలో బుగ్గ మఠం భూముల సర్వే రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూములను ఆక్రమించారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో బుగ్గ మఠం భూముల రీ సర్వే జరుగుతోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం ఉంటున్న భూములు ఇదివరకు బుగ్గ మఠానికి చెందినదిగా చెబుతున్నారు. అయితే ఈ భూములు తన సోదరుడు కొనుగోలు చేసినవని పెద్దిరెడ్డి చెబుతుండగా.. తాజాగా రీ సర్వే చేసిన అధికారులు బుగ్గ మఠం భూములు ఆక్రమణకు గురయ్యాయని ప్రాథమికంగా నిర్ధారించారు. 6 సర్వే నంబర్లలో తమ మఠానికి 14.49 ఎకరాల భూమి ఉందని, వాటికి హద్దులు తెలపాలంటూ తిరుపతి అర్బన్ తహసీల్దార్‌కు బుగ్గ మఠం ఈవో వెంకటేశ్వర్లు గత నెల 17న వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 3న రెవెన్యూ, సర్వే అధికారులు రోవర్ ద్వారా హద్దులను గుర్తించారు. అదే రోజు సంబంధిత నివేదికతో పాటు స్కెచ్, గూగుల్ మ్యాప్‌లను బుగ్గ మఠం అధికారులకు అందించారు.మొత్తం 14.49 ఎకరాల్లో 3.88 ఎకరాలు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమణలో ఉన్నట్లు గతంలోనే విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రికార్డులు ఉంటే అందించాలని బుగ్గ మఠం అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చినా ఇప్పటివరకూ స్పందించలేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆ భూమిలో నుంచి పెద్దిరెడ్డి నివాసానికి వెళ్లేందుకు 9.51 లక్షలతో సిమెంట్ రోడ్డును నిర్మించారు. రహదారికి పక్కనే బుగ్గ మఠం స్థలంలో పశుగ్రాసం సాగు చేస్తున్నారని సర్వే అధికారులు ఇచ్చిన స్కెచ్‌ను బట్టి తెలుస్తోంది.స్థానికుల విజ్ఞప్తి మేరకు రహదారి వేస్తున్నామని అప్పట్లో పేర్కొన్నా, ఇప్పటికీ ఆ మార్గంలో సామాన్యులు రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. మరోవైపు మఠానికి ఎంత భూమి ఉంది? ప్రస్తుతం ఉన్నది ఎంత? లీజుకు ఇచ్చింది ఎంత? అనే వివరాలు అందించాలని తిరుపతి ఆర్డీవో కార్యాలయ అధికారులు బుగ్గ మఠం ఈవోను కోరారు. వాటితోపాటు తాము గుర్తించిన హద్దుల ప్రకారం ఎంత భూమి ఆక్రమణలో ఉందో తెలపాలన్నారు. ఈ సమాచారం ఇచ్చేందుకు 10 రోజులు సమయం కావాలని మఠం అధికారులు కోరారు. ఆ తర్వాత కబ్జా చేసిన వ్యక్తులపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోనుంది.నగరంలో ముఖ్యమైన ప్రాంతాలంతా ఇదివరకు ఉన్న మఠాలకు చెందినవే. హథిరామ్ మఠం తరహాలో బుగ్గ మఠానికి సైతం నగరంలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ఈ భూములు కోట్ల రూపాయలు ఖరీదైనవి. అయితే ఇందులో చాలావరకు ఆక్రమణకు గురయ్యాయి. చాలా ఏళ్ల క్రితం ఈ భూములను మఠం పెద్దల నుంచి కౌలుకు తీసుకుని చివరకు వాటిని సొంతం చేసుకున్నారు. ఈ భూములపై వివిధ కోర్టుల్లో అనేక కేసులు కూడా నడుస్తున్నాయి.మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తిరుపతి నగరం నడిబొడ్డున సొంతిల్లు ఉంది. ఇంటి చుట్టూ గోశాల, ఇతర ప్రత్యేక భవనాలు ఉన్నాయి. సుమారు మూడేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చంద్రబాబు.. పెద్దిరెడ్డి నివాసం ఉన్న స్థలంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుగ్గ మఠం భూములను ఆక్రమించుకొని పెద్దిరెడ్డి తిరుపతిలో నివాసిస్తున్నారని నాడు ఆరోపించారు. చంద్రబాబు ఆరోపణలు అవాస్తవం అంటూ మంత్రి హోదాలో అప్పుడే పెద్దిరెడ్డి చంద్రబాబుకు కౌంటర్ ఇచ్చారు.బుగ్గ మఠం భూములు ఆక్రమణకు గురయ్యాయని తాజాగా సర్వే అధికారులు ప్రాథమికంగా నిర్ధారించడంతో ఇప్పుడు ఏం చేయబోతున్నారన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే పుంగనూరు నియోజకవర్గంలోని సదుం అటవీ ప్రాంతం నడుమ పెద్దిరెడ్డి అతిథి గృహం నిర్మాణంపై కూడా ఆ మధ్య పెను దుమారం రేపింది. అటవీ భూములను ఆక్రమించుకున్నారని పెద్దిరెడ్డిపై ఆరోపణలొచ్చాయి. ఈ విషయం మర్చిపోకముందే తిరుపతిలో ఆయన నివాస భూమిపై వివాదం తాజాగా తెరపైకి వచ్చింది.ఈ వివాదంపై పెద్దిరెడ్డి ఇప్పటివరకు మీడియా ముందుకొచ్చి క్లారిటీ ఇవ్వలేదు. అయితే ఈ భూములు తన సోదరుడైన తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అధికారికంగా కొనుగోలు చేసినట్లు పెద్దిరెడ్డి చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని రికార్డులను సైతం అధికారులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా చివరికి ఈ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందో అన్న చర్చ జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.

## అమరావతిలో జోరుగా రియల్ వ్యాపారం

విజయవాడ, మే 7, అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం చేశారు మరో మూడేళ్లలో ప్రజా రాజధాని అందుబాటులోకి వస్తుందని ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబు పై తనకు నమ్మకం ఉందని.. ఆయన చేసి తీరుతారని ప్రధాని ప్రకటించారు. దీంతో అమరావతికి కొత్త ఊపిరి వచ్చినట్లు అయింది. అయితే అమరావతి రాజధాని కాకుండా.. సమాన స్థాయిలో అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఊపందుకోవడం విశేషం. అమరావతి ప్రాంతంలో ఎక్కడ చూసినా రియల్ ఎస్టేట్ హడావిడి కనిపిస్తోంది. మూతపడిన ఆఫీసులు తెరుచుకుంటున్నాయి. లేఅవుట్ సరిహద్దు రాళ్లకు రంగులు పడుతున్నాయి. లేఅవుట్లలో కొత్తగా ఫ్లెక్సీలు, జెండాలు కడుతున్నారు. వాటి విక్రయాల కోసం మార్కెటింగ్ సిబ్బందిని నియమిస్తున్నారు.2014లో రాష్ట్ర విభజన జరిగింది. తెలంగాణ విభజిత రాష్ట్రం కాగా.. ఏపీ నవ్యాంధ్రప్రదేశ్ గా మారింది. అటువంటి సమయంలో అందరి అభిప్రాయంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 33 వేల ఎకరాల భూమిని రైతుల స్వచ్ఛందంగా అమరావతి రాజధాని కోసం ఇచ్చారు. అది మొదలు తెలంగాణలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతి వైపు చూడడం ప్రారంభించారు. ఆంధ్రుల రాజధాని అమరావతి ప్రపంచ దేశాల్లో భావి నగరంగా మారుతుందని ఆశించారు. అందుకే పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసి ప్లాట్లను విక్రయించే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ భూముల ధరలు ఆకాశానికి అంటాయి. కానీ 2019లో అధికారం చేతులు మారడం.. అమరావతి రాజధాని నిర్వీర్యం కావడం.. మూడు రాజధానులు తెరపైకి రావడం చకచకా జరిగిపోయాయి. అప్పటివరకు జెట్ స్పీడ్ తో వెళ్లిన రియల్ ఎస్టేట్ వ్యాపారం అమాంతం పడిపోయింది. గత ఐదేళ్లలో ఆ రంగం పై ఆధారపడిన వ్యాపారులు, ఉద్యోగులు వీధిన పడిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ వ్యాపారం పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమన్నారు. కానీ ఎట్టకేలకు టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి కొత్త కళ వచ్చింది. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి.ప్రస్తుతం అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటోంది. అమరావతిలో పొలాలను ఎక్కడా కొనే పరిస్థితిలో లేదు. కోర్ క్యాపిటల్ పరిధిలో పొలాలు కొనగలిగే రేంజ్ లో కూడా ధరలు లేవు. అమరావతి చుట్టుపక్కల, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎక్కడ కూడా పొలాలు కొనుగోలు చేయడానికి ధర అందుబాటులో లేదు. ప్రస్తుతం ఒక అమరావతి ప్రాంతంలోనే కాకుండా.. గుంటూరు, విజయవాడ, మంగళగిరి, తెనాలి, బాపట్ల వరకు ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో సామాన్యులు అక్కడ కొనుగోలు చేసే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.గత అనుభవాల దృష్ట్యా అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పై పెట్టుబడి పెట్టే వారు మాత్రం చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. గతం మాదిరిగా దూకుడుగా అడుగు వేసే పరిస్థితి లేదు. పెట్టుబడి పెట్టాలనుకునే వాళ్లు కొద్ది రోజులు ఆగుదాం అని ఆలోచిస్తున్నారు. మరికొందరు అయితే కేంద్ర ప్రభుత్వం సహాయం, రాష్ట్ర ప్రభుత్వం దూకుడు, పార్లమెంట్లో ప్రత్యేక చట్టం వంటి వాటిని దృష్టిలో పెట్టుకొని భూముల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఒకటి మాత్రం నిజం. గతంతో పోల్చుకుంటే కొనుగోలు సంఖ్య మాత్రం పెరగడం లేదు. ఈ విషయాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సైతం ధ్రువీకరిస్తోంది. మొత్తానికైతే అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. కానీ గత మాదిరిగా దూకుడుగా వెళ్లడం లేదు.

## మళ్లీ అమల్లోకి బేబి కిట్

ఏలూరు, మే 7,కూటమి ప్రభుత్వం మరో పథకాన్ని పునరుద్ధరించింది. బేబీ కిట్ పథకాన్ని మళ్లీ అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ పథకం ద్వారా నవజాత శిశువులకు మేలు జరగనుంది. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బేబీ కిట్ పథకాన్ని పునరుద్ధరించింది. ఈ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు, నవజాత శిశువుల సంరక్షణ కోసం ఉచితంగా కిట్ ఇస్తారు. 2014-2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని "ఎన్టీఆర్ బేబీ కిట్" పేరుతో అమలు చేసింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక.. ఈ పథకాన్ని అపేసింది. తాజాగా ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరించిందనవజాత శిశువులకు అవసరమైన ప్రాథమిక వస్తువులను అందించడం ద్వారా.. వారి ఆరోగ్యాన్ని, పరిశుభ్రతను కాపాడటం, శిశు మరణాలను తగ్గించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది ఆర్థికంగా కూడా సహాయపడుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలందరూ ఈ పథకానికి అర్హులు. ఈ కిట్‌లో సుమారు రూ. 1000 నుండి రూ. 2000 విలువ చేసే వస్తువులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

ఏయే వస్తువులు ఉంటాయి..

- బేబీ బెడ్ కమ్ క్యారియర్ (దోమతెరతో సహా)
- వాటర్ ప్రూఫ్ కాట్ షీట్
- బేబీ డ్రెస్
- వాషబుల్ నేప్కిన్స్
- టవల్
- బేబీ పౌడర్
- బేబీ షాంపూ
- బేబీ ఆయిల్
- బేబీ సబ్బు
- సోప్ బాక్స్
- శానిటైజర్
- కొన్ని రకాల క్రీములుబేబీ రాటిల్ టాయ్

వివరాలు సేకరించి..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగిన వెంటనే బాలింతలకు ఈ కిట్‌లను అందజేస్తారు. గతంలో అమల్లో ఉన్న ఈ పథకం కొంతకాలం నిలిచిపోగా.. జిల్లాల వారీగా ప్రసవాల వివరాలు సేకరించి మళ్లీ పునరుద్ధరించారు. పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న ఇలాంటి పథకాలను కూడా అధికారులు పరిశీలించారు.పేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక భారం తగ్గుతుంది.నవజాత శిశువులకు అవసరమైన ప్రాథమిక వస్తువులు అందుబాటులో ఉంటాయి.శిశువులకు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.శిశు మరణాల రేటును తగ్గించడంలో సహాయపడుతుంది.

## బస్టాండ్ పరిసరా ప్రాంతంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలి..

కోరుట్ల పట్టణంలో బస్టాండ్ పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకుడు కుంచం శంకర్ ఉన్నంత అధికారులకు డిమాండ్ చేశాడు, ఇతర గ్రామల నుంచి వచ్చిన ప్రయాణికులు తమ యొక్క బైకును బస్టాండ్ పరిధిలో పెట్టుకోవడం వలన బైకులు మాయం అయిపోతుందని ప్రయాణికులు అంటున్నారు, రోజుకు రెండు మూడు బైకులు మాయమైతుందని చెప్పారు. ఈ విషయంలో ఉన్నంత అధికారులకు దృష్టి తీసుకపోతే పట్టించుకోలేకపోతున్నారు అని చెప్పారు, వెంటనే బస్టాండ్ పరిధిలోని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందని చెప్పారు.

# పాకిస్తాన్ కు భారత్ రిటర్న్ గిఫ్ట్..

పహల్గాం దాడి తర్వాత భారత్ ప్రతీకార చర్యకు పూనుకుంటుంది. ఈ దాడిలో అమాయకమైన భారత పౌరులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను అంతం చేసేలా చర్యలు తీసుకుంటామని ఇప్పటికే భారత్ గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. అయితే ఎప్పుడెప్పుడు అని ఎదురుచూస్తున్న భారత్కు ఈ అర్ధరాత్రి యుద్ధం ప్రారంభించింది. విఆపరేషన్ సింధూర్' పేరుతో ప్రారంభించిన ఈ యుద్ధం లో భాగంగా ఉగ్రవాద శిబిరాలపై బాంబుల వర్షం కురిపించింది. దీంతో చాలామంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. అయితే కవ్వింపు చర్యల్లో భాగంగా పాకిస్తాన్ సరిహద్దుల్లో కాల్పులకు తెగబడింది దాదాపు 12 రోజుల పాటు సంయమనం పాటించిన భారత్... ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్ వెన్నులో వణుకు పుట్టించిందొ. అర్ధరాత్రి 1.44 గంటలకు పాక్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసింది భారత్ ఆర్మీ. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆర్మీ చేపట్టిన ఈ వైమానిక దాడులతో దాయాది దేశం ఉక్కిరిబిక్కిరవుతోంది. అయితే ఈ స్ట్రైక్స్ కేవలం టీజర్ మాత్రమేనని.. ఇది 'ఆపరేషన్ సింధూర్' మొదటి దశ మాత్రమేనా.! త్వరలో మరిన్ని దాడులు ఉండొచ్చంటూ సైన్యం నుంచి సంకేతాలు అందుతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక పాక్ టెర్రరిస్ట్ లాంచ్ ప్యాడ్‌ల ధ్వంసంతో దేశమంతా సంబరాలు జరుపుకుంటున్నారు ప్రజలు.అటు పాకిస్తాన్, పీఓకేలోని టెర్రరిస్టుల స్థావరాలే లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'పై మిత్ర దేశాలకు భారత్ సమాచారం అందించింది. దాడుల అనంతరం అమెరికా, యూకే, రష్యా, సౌదీ అరేబియా, యూఏఈ సహా.. పలు దేశాల ప్రతినిధులకు, సీనియర్ అధికారులతో మాట్లాడారు ఉన్నతాధికారులు. టెర్రర్ క్యాంప్‌లపై దాడికి కారణాల్ని వివరించారు. టెర్రరిజాన్ని అంతమొందించాలనే ఈ స్ట్రైక్స్ చేసినట్టు వివరించారు. ప్రక్ ప్రజలకు ఎలాంటి హాని జరగలేదని చెప్పారు.జమ్ము కాశ్మీర్లోని పహల్గంలో ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రవాదులు ఆకస్మికంగా ఈ ప్రాంతానికి వచ్చి భారత పౌరులను నిర్దాక్షిణ్యంగా కాల్చివేశారు. అయితే ఇందులో మహిళలు విడిచిపెట్టి వారి భర్తలను కళ్లెదుటే కాల్చివేయడం కాల్చివేసింది. అంతేకాకుండా హిందువులు ఎవరు అని అడిగి మరీ చెప్పడం భారత్ ను దెబ్బ కొట్టడమే లక్ష్యమని అంటున్నారు. ఈ దాడి కేవలం కొందరిపై మాత్రమే కాదని యావత్ దేశంపై అని ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. దీనికి ప్రతీకారంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా అవసరమైతే యుద్ధం కూడా చేయాల్సి వస్తుందని ఇదివరకే చెప్పారు.అయితే తాజాగా ప్రారంభించిన యుద్ధానికి 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టారు. సింధూర్ అంటే కేవలం నామమాత్రమైన పేరు మాత్రమే కాదని, మహిళలు భర్తలకు ప్రతిరూపంగా నుదుటన కుంకుమను ధరిస్తారు. కానీ పహల్గాం లో మహిళలను విడిచిపెట్టి వారి భర్తలను చంపి వారి నుదుటన ఉన్న కుంకుమను చెరిపివేశారు. ఈ కుంకుమ మరోసారి చెరిగిపోకుండా ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యమని? అందుకే ఈ ఆపరేషన్కు.. 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టినట్లు చెబుతున్నారు. ఉగ్రవాదులను అంత చేసి మహిళల గౌరవాన్ని నిలబెడతామని ఈ సందర్భంగా ఈ ఆపరేషన్కు ఈ పేరు పెట్టినట్లు చెబుతున్నారు.యితే భారత్, పాకిస్తాన్ మధ్య ప్రధానంగా ఉన్న నది సింధూ నది. ఈ నది నీళ్లను ఆపివేయడంతో అసలైన యుద్ధం మొదలైందని.. అందుకే దీనికి ఆపరేషన్ సింధూర్ అని పేరు పెట్టినట్లు మరి కొందరు అంటున్నారు. కానీ ముఖ్యంగా మహిళల కోసమే ఈ పేరును నిర్ణయించినట్లు మరి కొందరు అంటున్నారు. ఏది ఏమైనా 'ఆపరేషన్ సింధూర్'పేరుతో ప్రారంభమైన ఈ యుద్ధంలో భారత్ పై చేయి సాధిస్తుందని నమ్మ పలుకుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉగ్రవాదులపై మిస్సైల్స్ దాడి చేసిన వీడియోలు బయటకు వచ్చాయి. ఉగ్రవాదుల జాడ తెలుసుకున్న ఆర్మీ ఆ శిబిరాలను కుప్ప కూల్చేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. అయితే ఈ సమయంలో పాక్ చేస్తున్న కాల్పులను కూడా తిప్పికొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా 'ఆపరేషన్ సింధూర్' విజయవంతం కావాలని యావత్ భారతదేశం కోరుకుంటుంది.ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారతదేశం పాకిస్తాన్‌లోని అనేక ప్రదేశాలపై దాడి చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, ప్రజలకు ఇది జరగబోతుందని ముందే తెలుసునని అన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, "ఓవల్ కార్యాలయంలోకి వెళ్తున్నప్పుడే మాకు ఈ విషయం తెలిసింది. గతంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా ప్రజలకు ఏదో జరగబోతుందని తెలుసునని నేను అనుకుంటున్నాను. వారు చాలా కాలంగా పోరాడుతున్నారు. మీరు దీని గురించి ఆలోచిస్తే, వారు అనేక దశాబ్దాలు, శతాబ్దాలుగా పోరాడుతున్నారు. ఇది చాలా త్వరలోనే ముగుస్తుందని నేను ఆశిస్తున్నాను.'"మాకు ఎటువంటి అంచనా లేదు' ఇంతలో, భారత సైన్యం యొక్క 'ఆపరేషన్ సిందూర్' గురించి జూ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాట్లాడుతూ, "దీని గురించి మాకు తెలుసు. అయితే, ప్రస్తుతానికి మాకు ఎటువంటి అంచనా లేదు. మారుతున్న పరిస్థితి పర్యవేక్షిస్తున్నాము." అని అన్నారు.భారత సైన్యం చర్యపై రక్షణ మంత్రిత్వ శాఖ మాట్లాడుతూ, "ఒక నేపాలీతో సహా 26 మంది మరణానికి ప్రతీకారంగా, భారతదేశం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది, ఇది అనాగరికమైన పహల్గామ్ ఉగ్రవాద దాడికి కచ్చితమైన సంయమనంతో కూడిన ప్రతిస్పందన. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై లక్ష్యంగా దాడులు జరిగాయి, సరిహద్దు ఉగ్రవాద ప్రణాళిక మూలాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ముఖ్యంగా, పాకిస్తాన్ సైనిక స్థావరం ఏదీ దెబ్బతినలేదు, ఇది భారతదేశం సంయమనంతో చేసిన దాడి.

# మానవీయ స్వచ్ఛంద సేవలో అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ

నోబెల్ శాంతి బహుమతి-1901 గ్రహీత హెన్రీ డ్యునాంట్ 1864లో నిర్వహించిన జెనీవా సమావేశంలో తీర్మానించిన ప్రకారం అంతర్జాతీయ మానవీయ దాతృత్వ స్వచ్ఛంధ సంస్థగా రెడ్ క్రాస్ ప్రారంభం కావడం, 192 నేషనల్ సొసైటీస్గా విస్తరించి 17 మిలియన్ల స్వచ్ఛంధ కార్యకర్తలతో నేడు ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంధ సంస్థగా నేటికీ అప్రతిహతంగా తన మానవీయ సేవలకు ప్రపంచ నలుమూల విస్తరించి కొనసాగుతున్నది. హెన్రీ డ్యునాంట్ జన్మదినం 08 మే రోజున ప్రతి ఏట "ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం" పాటించుట 1948 నుంచి ఆనవాయితీగా మారింది. "మానవత్వంతో శాంతి వైపు (విత్ హుమానిటీ, టువర్డ్స్ పీస్)" అనే నినాదంతో ఒక తటస్థ, నిష్పాక్షిక మానవీయ సంస్థగా రెడ్ క్రాస్ నేడు ప్రపంచవ్యాప్తంగా తన సేవాహస్తాలను విస్తరించి ముందుకు సాగుతోంది. ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం-2025 ఇతివృత్తంగా "మానవీయతను పోషిస్తూనే: విశ్వాసం, సహాయం, స్వస్థత (కీపింగ్ హుమానిటీ ఎలైవ్ : హోప్, హెల్ప్, హీల్)" అను అంశాన్ని తీసుకోని అవగాహన కార్యక్రమాలను రూపొందించారు. రెడ్ క్రాస్ స్వచ్ఛంధ సేవకులు ప్రతికూలమైన ప్రమాదకరమైన మారుమూల ప్రాంతాల్లో సహితం ధైర్యంగా తమ అత్యవసర సేవలైన ఆహారాన్ని అందించి ఆకలి చావులు ఆపడం, ప్రకృతి వైపరీత్యాల సమయం అవసర సేవలు అందించడం, వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవడం, యుద్ధ బాధితులను ఆదుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆపన్నహస్తం అందించడం, అంటువ్యాధులు ప్రభలినపుడు రక్షణ గొడుగుగా నిలవడం లాంటి అసంఖ్యాక అత్యవసర సేవలను కొనసాగిస్తున్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం రోజున రెడ్ క్రాస్ స్వచ్ఛంధ సేవకుల త్యాగం, అంకితభావం, ధైర్యాలను కొనియాడుతూ వారిని సముచితంగా గౌరవించుకోవడం మానవత్వం కలిగిన పౌర సమాజ కనీస బాధ్యత. ఏడు మౌలిక సూత్రాల పునాదిగా రెడ్ క్రాస్ సొసైటీలు ఏర్పడ్డాయి. మానవత్వం, నిష్పక్షపాతం, తటస్థ స్థితి, స్వయం ప్రతిపత్తి, స్వచ్ఛంధ సేవలు, ఏకత, విశ్వవ్యాప్తం అనబడే ఏడు ప్రధాన సూత్రాల ఆధారంగా రెడ్ క్రాస్ సొసైటీల సేవలు నిరాటకంగా, వేగంగా కొనసాగుతున్నాయి. భారతీయ రెడ్ క్రాస్ సేవలు దాదాపు 1100ల సొసైటీల ద్వారా తమ సేవలను కొనసాగిస్తున్నాయి. నిత్యం జరిగిగే సేవా కార్యక్రమాల్లో రక్త దాన శిబిరాల నిర్వహణ, అవసర పేదలకు కనీస ధరలకు రక్తాన్ని అందించడం "రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్"ల ద్వారా కొనసాగుతున్నది. సహజ విపత్తులు, యుద్ధ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలకు సహితం ముందుగా చేరి తమ అమూల్య సేవాహస్తాలను అందిస్తున్న రెడ్ క్రాస్ సంస్థ సదా మానవీయతను, ప్రేమను నింపుకున్న అమ్మ వలె ఆపన్నహస్తం అందించాలని కోరుకుందాం, అనుకూలంగా ఉంటే రెడ్ క్రాస్ కార్యకర్తగా పేరు నమోదు చేసుకొని సేవకులుగా మారుదాం, మానవత్వాన్ని నిలుపుదాం.

## జగిత్యాలలో కార్యక్రమాలకు మంత్రులు దూరం

కరీంనగర్, మే 7,జగిత్యాల కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి?జీవన్ రెడ్డి అంటే కాంగ్రెస్ అనే చెరగని ముద్ర వేసుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత జీవన్ రెడ్డికి ఊహించని పరిణామాలు ఎదురవుతున్నాయి. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను హస్తం పార్టీలో చేర్చుకోవడాన్ని జీవన్ రెడ్డి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆయనతో కలిసి పని చేయడానికి ససేమిరా అంటుండడంతో రెండు వర్గాలుగా విడిపోయింది జగిత్యాల కాంగ్రెస్. ప్రస్తుతం ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైందట పరిస్థితి.జీవన్ రెడ్డి సీనియర్ నేత కావడంతో ఆయనతో సన్నిహితంగా ఉన్న వాళ్లంతా..ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కి దూరంగా ఉంటున్నారు. అందుకే జీవన్ రెడ్డిని కాదని కొంతమంది పార్టీ శ్రేణులు..సంజయ్ కుమార్ తో సఖ్యతగా మెదలడం లేదనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవైనా ప్రారంభించాలన్నా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలన్నా జగిత్యాలకు అమాత్యులు ఆమడ దూరం ఉంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే పొరుగు నియోజకవర్గమైన ధర్మపురి ఎమ్మెల్యే, జగిత్యాల జిల్లా అధ్యక్షుడైన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం జీవన్ రెడ్డి మాట జవ దాటరు. అందుకే జీవన్ రెడ్డి పట్ల విధేయతను ప్రదర్శించే క్రమంలో లక్ష్మణ్ కుమార్..ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ని కలుపుకొని వెళ్లేందుకు సంకోచిస్తుంటారట. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం జీవన్ రెడ్డిని కాదని నియోజకవర్గంలో అడుగు పెట్టే పరిస్థితి లేదట. ధర్మపురి నియోజకవర్గంలో జరిగే ఏదో ఒక అభివృద్ధి పనులకు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవగా..వారంతా జగిత్యాలను టచ్ చేయకుండానే వెళ్లిపోతున్నారట. సంజయ్ కుమార్ ను ఒంటరిని చేయడానికే జీవన్ రెడ్డి మంత్రులను అడుగు పెట్టకుండా చేస్తున్నారనే టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో సాగుతోంది.సీఎం రేవంత్ రెడ్డి మనిషిగానే ఎమ్మెల్యే సంజయ్ కి ముద్ర పడింది. సంజయ్ సైతం నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం నేరుగా సీఎంనే సంప్రదించి నిధులను మంజూరు చేయించుకుంటున్నారట. దీంతో కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంజయ్ ని పార్టీ నాయకత్వం అక్కున చేర్చుకున్నట్లా లేనట్లా అనే చర్చ జగిత్యాల రాజకీయవర్గాల్లో జరుగుతోంది. ఇద్దరి మధ్య రాజీ కుదర్చడానికి ఎవరూ సాహసించకలేకపోతున్నారట. దీంతో ఇద్దరి మధ్య అంతర్గత విభేధాలు కాస్తా రచ్చకెక్కుతున్నాయి.ఇద్దరు నేతల వ్యవహారంతో స్వపక్షంలో విపక్షంలో మారింది పరిస్థితి. ఒకే జెండా కింద రాజకీయాలు సాగిస్తున్న జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్..వీరిద్దరి చేతులు కలిసేంత వరకు జగిత్యాలలో మంత్రులు అడుగు పెట్టరనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. ఇలా వీరిద్దరు ఎంతకాలమని కలవని రైలు పట్టాల్లా ఉంటారో చూడాలంటూ జిల్లాలో ఉన్న కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు. పార్టీ కోసమైనా ఇద్దరూ కలుస్తారా.. లేక ఎప్పటికీ డిష్యూం డిష్యూం అనుకుంటూనే ఉంటారా అనేది చూడాలి.

# దాడులు ఎక్కడ జరిగాయంటే...

లాహోర్, మే 7, (న్యూస్ పల్స్) ఆపరేషన్ సింధూర్ పేరిట ఉగ్రస్థావరాలే టార్గెట్‌గా ఇండియన్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయ్. పాకిస్తాన్‌లో 4.. పీవోకేలో 5 చోట్ల ఎటాక్స్ కొనసాగుతున్నాయ్. ఇందులో ముంబై దాడుల సూత్రధారి, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయూద్ కంచుకోట మురిడ్కే కూడా ఉంది. ముజఫరాబాద్‌లోని 2 ప్రాంతాలు, కోట్లీ, గుల్పూర్, భీంబర్, సియాల్‌కోట్, చక్రంబూ, మురిడ్కే, బహ్వల్పూర్‌లోని టార్గెట్స్‌ను ఆర్మీ ఛేధించింది. జైషే మహ్మద్, లష్కరే ఉగ్రసంస్థల టాప్ లీడర్స్ లక్ష్యంగా 'ఆపరేషన్ సింధూర్' చేపట్టింది ఇండియన్ ఆర్మీ.

ఇండియన్ ఆర్మీ ఎక్కడెక్కడ దాడి చేసిందంటే..

? మురిడ్కే.. ఇక్కడే లష్కరే తోయిబా హెడ్ క్వార్టర్ ఉంది.. దాంతో, మిస్సైళ్లతో విరుచుకుపడింది భారత్

? బహావల్‌పూర్.. ఇక్కడ జైష్-ఎ-మహమ్మద్ హెడ్ క్వార్టర్ ఉంది.. ఈ ప్రాంతంపై కూడా బాంబుల వర్షం కురిపించింది ఇండియన్ ఆర్మీ

? ముజఫరాబాద్.. పీవోకేకి హెడ్‌క్వార్టర్ ఇది.. ఇక్కడే హిజ్బుల్ ముజాహిదీన్ బెస్ ఉంది.. ముజఫరాబాద్‌లో రెండు ప్రాంతాలను టార్గెట్ చేసింది భారత్

? కోట్లీ.. ఇక్కడున్న టెర్రర్ క్యాంప్స్‌పై బాంబుల వర్షం కురిపించింది ఇండియన్ ఆర్మీ

? ముజఫరాబాద్‌లో మరోచోట మిస్సైళ్లతో దాడి చేసింది భారత్

? గుల్పూర్? ఇక్కడున్న టెర్రర్ లాంచ్ ప్యాడ్‌పై దాడులు చేసింది భారత్

? సియాల్‌కోట్.. ఇక్కడ టెర్రర్ క్యాంప్‌పై మిస్సైళ్ల వర్షం కురిపించింది

? చాక్అమ్రూ.. ఇక్కడ టెర్రర్ లాంచ్ ప్యాడ్‌పై భారత సైన్యం దాడులు చేసింది

? ఇక పీవోకేలో 5 ప్రాంతాల్లో ఎటాక్స్ చేసింది

? భీంబర్.. ఇక్కడ కూడా టెర్రర్ లాంచ్ ప్యాడ్‌పై దాడులు చేసింది ఇండియన్ ఆర్మీ

ఇప్పటివరకు 9 ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడింది ఇండియన్ ఆర్మీ. 8 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల రేంజ్‌లో మిస్సైళ్ల వర్షం కురిపించింది.

? బహావల్‌పూర్‌లో 100 కిలోమీటర్ల దూరం వరకు

? మురిడ్కేలో 30 కిలోమీటర్ల లోపలివరకు

? గుల్‌పూర్‌లో 35 కిలోమీటర్ల లోపలివరకు

? సవాయిలో 30 కిలోమీటర్ల లోపలివరకు

? బిలాల్‌లో 25 కిలోమీటర్ల లోపలివరకు

? కోట్లీలో 15 కిలోమీటర్ల లోపలివరకు

? బర్నాలలో 10 కిలోమీటర్ల లోపలివరకు

? సర్జల్‌లో 8 కిలోమీటర్ల లోపలివరకు

? మెహ్మూనాలో 15 కిలోమీటర్ల దూరం వరకు

## ఆపరేషన్ సింధూర్ పేరు ఎందుకు పెట్టారో తెలుసా..

హైదరాబాద్, మే 7, పహల్గామ్‌దాడిలో ఉగ్రవాదులు పురుషులను మాత్రమే ఎంచుకుని కాల్చి చంపి ఎందరో మహిళల నుదుటి సిందూరం తుడిచేసిన కారణంగానే ఆపరేషన్‌కు 'సింధూర్' అని నామకరణం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిలో కళ్లముందే భర్తలను కోల్పోయిన భార్యలకు చేసే న్యాయమే ఆపరేషన్ సింధూర్. కేంద్రం ఆ అర్థంలోనే ఈ ఆపరేషన్‌కు ఆ పేరు ఖరారు చేసింది. అదీగాక కుంకుమ పువ్వుకు ప్రసిద్ధి గాంచిన కశ్మీర్ లోయలో పహల్గామ్ ఉగ్రదాడులతో పాకిస్తాన్ రక్తం పారించింది. పాక్ ఉగ్రదాడికి జవాబుగా ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతీకార దాడులు చేపట్టింది భారత సైన్యం.పహల్గామ్‌లో రక్తం పారించిన ఉగ్రవాద దాడికి భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. దాడి జరిగిన తర్వాత బిహార్‌లో ప్రధానమంత్రి వార్నింగ్ ఇచ్చినట్టుగానే వారి స్థావరాల్లో వారికి సమాధి కట్టేశారు. కొన్ని రోజుల నుంచి పక్కా సమాచారాన్ని సేకరించి ఉగ్రస్థావరాల లెక్కలు తీసి మరీ టార్గెట్ చేసింది భారత్. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సాయుధ దళాలు దాడులు చేశాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ సీరియస్‌గా రియాక్ట్ అయింది. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను ఒక్కరిని కూడా విడిచిపెట్టేది లేదని ప్రధాని మోదీ తీవ్రస్వరంతో హెచ్చరించారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా భారత సైన్యానికి చెందిన వివిధ రంగాలతో, అధికారులతో, దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన విభాగాలతో ప్రధాని, హోం, డిఫెన్స్ మంత్రులు విడతలు విడతలుగా చర్చలు జరుపుతూ వచ్చారు. ప్రతిపక్షాలు సహా ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా సరే.. తమ మద్దతు ఉంటుందని అండగా నిలిచాయి.

ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత.. 9 ఉగ్రవాద స్థావరాలను తుడిచిపెట్టేస్తూ భారత్ వైమానిక దాడులు నిర్వహించింది.పహల్గామ్ దుర్ఘటన తాలూకు గాయాలు ఇంకా మానక ముందే, భారత్ తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన పోరాట పటిమను నిరూపించింది. అంతర్జాతీయ సమాజం నుంచి వస్తున్న సానుకూల స్పందనలు, సంపూర్ణ సహకారం లభిస్తుండటంతో, ఉగ్రవాదాన్ని భూస్థాపితం చేసే వరకు భారత్ వెనకడుగు వేయదని స్పష్టమవుతోంది. ఇది కేవలం ప్రతీకార చర్య కాదు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత ఆత్మగౌరవం నినదించిన సందర్భం! ఈ దాడులు ఎక్కడపడితే అక్కడ కాకుండా, పహల్గామ్ దాడికి సూత్రధారులుగా భావిస్తున్న 9 నిర్దిష్ట ఉగ్ర స్థావరాలపైనే జరిగాయి. మన గడ్డపై హింసను సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్న కీలక ఉగ్రవాద కేంద్రాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా సైన్యం ముందుకు కదిలింది. పాకిస్థాన్ సైనిక స్థావరాల జోలికి పోకుండా, కేవలం ఉగ్రవాద కార్యకలాపాలకు అడ్డాగా మారిన చోట్లనే మన బలగాలు ప్రహరించాయి. అత్యంత పక్కా ప్రణాళికతో, ప్రెసిషన్ స్ట్రైక్స్‌తో ఈ ఆపరేషన్ విజయవంతమైంది.

ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం తన సత్తాను మరోసారి నిరూపించింది. దేశ భద్రతకు భంగం వాటిల్లితే ఎక్కడైనా, ఎప్పుడైనా ప్రహరించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ చర్య ద్వారా చాటిచెప్పింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు ఇది స్పష్టమైన, గట్టి హెచ్చరిక. ఉగ్రవాద చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత్ తేల్చి చెప్పింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో భారత్ ఎప్పటికీ వెనకడుగు వేయదని ఆపరేషన్ సింధూర్ స్పష్టం చేసింది.

# అందాల పోటీలకు భాగ్యనగరం ముస్తాబు

హైదరాబాద్, మే 7, మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ రెడీ అయింది. ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రస్తుతం సందడిగా మారింది, వివిధ దేశాల నుంచి అందాల పోటీదారులు ఇక్కడ దిగుతున్నారు. విదేశీ ప్రతినిధులకు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. విమానాశ్రయంలో ప్రత్యేక లాంజ్‌లు, సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.. అటు.. మిస్ వరల్డ్ పోటీలపై అధికార, విపక్షాల మధ్య మాటలయుద్ధం కాక రేపుతోంది. ఈ క్రమంలో.. మంత్రి జూపల్లి కృష్ణారావు విపక్షాల విమర్శలపై స్పందించారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకే మిస్ వరల్డ్ పోటీలు.. అంటూ.. అందాల పోటీలపై విపక్షాల కామెంట్స్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు.పెట్టుబడుల సంగతి ఎలా ఉన్నా.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సందడి మాత్రం షురూ అయింది. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇప్పటికే సుమారు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారు. వారిలో మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే జాన్సన్‌వాన్ రెన్స్‌బర్గ్ వంటి వారు ఉన్నారు. పర్యాటక శాఖ అధికారులు వీరికి విమానాశ్రయంలో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అనంతరం వారిని బస ఏర్పాటు చేసిన హోటళ్లకు తరలించారు.ఈ మిస్ వరల్డ్ పోటీల్లో పాకిస్తాన్ కూడా ప్రాతినిధ్యం వహిస్తోంది. మిస్ పాకిస్తాన్ కూడా ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నట్లు సమాచారం. ప్రపంచ సుందరీమణులతో హైదరాబాద్ కళకళలాడుతోంది, అంతర్జాతీయ స్థాయిలో నగరం ప్రతిష్టను పెంచే ఈవెంట్‌కు అంతా సిద్ధమైంది.ఈ నెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానుండగా.. 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలేతో ముగియనున్నాయి. అదే రోజు విజేతను ప్రకటిస్తారు. జూన్ 2న జరిగే తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల్లో మిస్ వరల్డ్‌గా నిలిచిన సుందరీమణి పాల్గొంటారు. ఈ పోటీలకు 116 దేశాలకు చెందిన పోటీదారులు హాజరుకానున్నారు. దాంతో.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్ హైటెక్స్ వరకూ బ్యానర్లు, కటౌట్లు కళకళలాడిపోతున్నాయి.మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనేందుకు ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే.. మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో సెర్వాన్‌టెస్, మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే సహా దాదాపు 90 మందికిపైగా పోటీదారులు హైదరాబాద్‌లో అడుగు పెట్టారు. వారికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పర్యాటక శాఖ అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, ఆ తర్వాత అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్స్‌కు తరలించారు. మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే టీమ్‌లు బస చేసేందుకు హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్స్‌లో ఏర్పాట్లు చేశారు. మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి ఏర్పాట్లను టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా.. మంత్రి జూపల్లిని మిస్ ఇండియా, మిస్ మెక్సికో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఇదిలావుంటే.. మిస్ వరల్డ్ పోటీలపై రాజకీయంగా దుమారం రేగుతోంది. అకాల వర్షాలతో అన్నదాత ఆగమవుతుంటే వారి గోడు పట్టదా అంటూ రేవంత్ ప్రభుత్వంపై విపక్షాలు మండిపడుతున్నాయి.

అటు.. కశ్మీర్‌లో కల్లోలం చెలరేగితే అందాల పోటీలు నిర్వహిస్తారా అని హిందూ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అలాగే.. అందాల పోటీలను వ్యతిరేకిస్తూ మహిళా సంఘాలు ర్యాలీలు తీస్తున్నాయి.

## కళ్లకు గంతలు కట్టుకుని సీహెచ్ వోల దీక్ష

అమలాపురం అమలాపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట సి హెచ్ ఓ లు కళ్ళకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన దీక్షకు దిగారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో పది రోజులుగా హెల్త్ ఆఫీసర్ల ఆందోళన కొనసాగుతోంది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ కళ్ళకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన దీక్షకు దిగారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసారు. ఎన్ హెచ్ ఎమ్ ఉద్యోగులతో సమానంగా 23% శాతం వేతన సవరణ జరపాలని డిమాండ్ చేసారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి , నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని కోరుతూ ఆందోళనకు దిగారు. గత పది రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యర్తం చేసారు. ఇప్పటికైనా అధికారులు సంఘ నాయకులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. వేతన సవరణ అంశం , పెండింగ్ బకాయిలు , 6 సంవత్సరాలుగా ఒక్క రూపాయి వేతనం పెరగక పోగా రెండు సంవత్సరాలుగా ఉన్న బకాయిలు కోసం, ఇన్సెంటివ్స్ విషయంలో కూడా ఉన్న అపోహలు తీసివేసి కేవలం సి హెచ్ ఓ చేసే పని ఆధారంగానే ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఇప్పటికైనా మా ఆవేదన పట్టించుకొని పరిష్కరించాలని అన్నారు.

# నేడు వరల్డ్ రెడ్‌క్రాస్ దినోత్సవం

యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇలాంటి సేవా సంస్థలన్నింటిలోకీ అతి పెద్దది.

1895వ సంవత్సరంలో ఫ్రాంకో-సార్డియన్ కూటమికి, ఆస్ట్రియా సామ్రాజ్యవాద సైనిక దళాలకు మధ్య జరిగిన యుద్ధంలో దాదాపు 40 వేలమంది సైనికులు అసువులు బాయగా, వేలాది మంది గాయపడ్డారు. ఈ యుద్ధంలో గాయపడ్డ క్షతగాత్రులను ఆదుకుని, వారికి సేవలందించేందుకు అప్పట్లో స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ డునాంట్ అనే వ్యక్తి ముందుకొచ్చాడు.

ఆ సంఘటన తరువాత... తానే ఇలాంటి వారికోసం ఓ సేవాసంస్థను ఎందుకు స్థాపించకూడదని ఆలోచనలో పడ్డాడు హెన్రీ డునాంట్. అతని ఆలోచనల ఫలితంగా ఏర్పడిన సంస్థే ఈ రెడ్‌క్రాస్ ఇంటర్నేషనల్ సొసైటీ. అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటైన ఈ సంస్థ ఇప్పుడు దాదాపు అన్నిరకాల సేవా కార్యకలాపాలను నిర్వహిస్తోంది.

స్విడ్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ఉంటుంది. దానిని తారుమారు చేసి తెల్లని బ్యాగ్రౌండ్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచాడు. 8-5-1812న జన్మించిన హెన్రీ డ్యూనెన్ట్ గౌరవార్థం ప్రతి సంవత్సరం మే 8న ప్రపంచవ్యాప్తంగా రెడ్ క్రాస్ దినోత్సవం జరుపుకుంటారు. 1901 లో ఈయనకు నోబెల్ బహుమతి లభించింది.

× మే 8 న రెడ్‌క్రాస్ దినం జరుపుకొనుటకు కారణం--రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ జన్మదినం.

× మే 8 న రెడ్‌క్రాస్ దినంగా జరపాలని ఏ సంవత్సరంలో నిర్ణయించారు--1938.

× రెడ్‌క్రాస్ సంస్థ ఏ సం.లో స్థాపించబడింది--1863.

× రెడ్‌క్రాస్ సంస్థ ఇప్పటి వరకు ఎన్నిసార్లు నోబెల్ శాంతిబహుమతిని గెలుచుకుంది--3 సార్లు (1917, 44, 63).

× రెడ్‌క్రాస్ సంస్థను హెన్రీ డ్యూనాంట్ ఏ నగరంలో స్థాపించారు--జెనీవా.

× రెడ్‌క్రాస్ పతాకం ఏ దేశ పతాకాన్ని పోలి ఉంటుంది--స్విట్జర్లాండ్ (కేవలం రంగులు మాత్రమే తారుమారు).

× రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ ఏ దేశస్థుడు--స్విట్జర్లాండ్.

× హెన్రీ డ్యూనాండ్‌కు ఏ సం.లో నోబెల్ శాంతి బహుమతి లభించింది--1901 (తొలి నోబెల్ శాంతి బహుమతి).

× భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఏ సం.లో స్థాపించబడింది--1920.

× భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రధానకేంద్రం ఏ నగరంలో ఉంది--ఢిల్లీ.

# దామోదర రాజనర్సింహ కు పరిస్థితి అర్థమైందా?



హైదరాబాద్, మే 7తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దామోదర రాజనర్సింహ, పార్టీలో జరుగుతున్న అంతర్గత సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఐక్యత లోపం, నాయకుల మధ్య విభేదాలు, బహిరంగ వివాదాలు పార్టీ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, ఆయన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.దామోదర రాజనర్సింహ ఆందోళనకు ప్రధాన కారణం, నారాయణఖేడ్‌లో ఇటీవల జరిగిన సంఘటన. కాంగ్రెస్ నాయకులు బహిరంగ వేదికపై ఘర్షణకు దిగడం, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలోనూ వివాదాలు చోటు చేసుకోవడం ఆయనను తీవ్రంగా కలవరపెట్టింది. ఈ ఘటన పార్టీలో నాయకుల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టంగా తెలియజేసిందని ఆయన పేర్కొన్నారు. 'పార్టీ నాయకులు బహిరంగంగా కొట్టుకోవడం ఏమిటి? ఇలాంటి చర్యలు పార్టీని ఎలా కాపాడతాయి?' అని ఆయన ప్రశ్నించారు.నారాయణఖేడ్ ఘటనతో పాటు, సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులపై వస్తున్న విమర్శలు కూడా దామోదర ఆవేదనకు కారణమని తెలుస్తోంది. కొందరు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికల ద్వారా పార్టీ నాయకత్వంపై తమ అసంతప్తిని వెల్లడిస్తున్నారు. ఇటువంటి చర్యలు పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీస్తాయని, శత్రు పక్షాలకు ఆయుధం అందిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ బలం దాని స్వేచ్ఛాయుత వాతావరణమని, అదే సమయంలో అది బలహీనతగా కూడా మారుతుందని దామోదర రాజనర్సింహ సూచించారు. 'పార్టీలో అభిప్రాయ బేదాలు సహజం. ఒక నాయకుడికి మరో నాయకుడితో విభేదాలు ఉండవచ్చు. కానీ, బహిరంగంగా వివాదాలు సష్టించడం పార్టీకి నష్టం కలిగిస్తుంది,' అని ఆయన అన్నారు. పార్టీ అంతర్గత సమస్యలను పరిష్కరించేందుకు బలమైన నాయకత్వం అవసరమని, నాయకులంతా ఒకే అజెండాతో ముందుకు సాగాలని ఆయన సూచించారుదివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డిని ఉదాహరణగా చూపుతూ, దామోదర రాజనర్సింహ నాయకులకు ఐక్యత పాఠం చెప్పారు. 'వైఎస్సార్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. అయినా, పార్టీని ఒక తాటిపై నడిపించి, అధికారంలోకి తెచ్చారు. ఆయన స్ఫూర్తిని నీతి నాయకులు అనుసరించాలి,' అని ఆయన పేర్కొన్నారు. పార్టీ ఈ రోజు అధికారంలో ఉండటం వెనుక ఎందరో నాయకులు, కార్యకర్తల త్యాగాలు ఉన్నాయని, ఆ శ్రమను గౌరవించాల్సిన బాధ్యత నాయకులపై ఉందని ఆయన గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య విభేదాలు, వర్గాలు సహజమేనని, అయితే అవి పార్టీ నాశనానికి దారితీయకూడదని దామోదర హెచ్చరించారు. 'పార్టీలో ఎంతో మంది కీలక నాయకులు ఉన్నారు. రాజకీయ విభేదాలు తప్పవు. కానీ, అందరూ ఐక్యంగా ఉంటూ, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడంపై దష్టి పెట్టాలి,' అని ఆయన సూచించారు. సంగారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ జిల్లా నాయకుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు, ఇక్కడ ఆయన కార్యకర్తలను ఉద్దేశించి, వారి కషే నాయకుల విజయానికి కీలకమని పేర్కొన్నారు.తెలంగాణ కాంగ్రెస్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చినప్పటికీ, అంతర్గత సవాళ్లు ఆ పార్టీని వెంటాడుతున్నాయి. నాయకుల మధ్య వర్గాలు, అసంతప్తులు, సమన్వయ లోపం వంటి సమస్యలు పార్టీ బలాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇటీవల సంగారెడ్డి డీసీసీ సమావేశంలో ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యత లేకపోవడంపై నాయకులు ఘర్షణకు దిగిన ఘటన కూడా ఈ సమస్యలను మరింత స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, దామోదర రాజనర్సింహ వ్యాఖ్యలు పార్టీ నాయకులకు ఒక హెచ్చరికగా, ఐక్యతకు పిలుపుగా నిలుస్తాయి.

## సైనికదాడలపై హర్షం

సికింద్రాబాద్ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా పాకిస్తాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై భారత ఆర్మీ దాడి చేసి గట్టిగా బుద్ధి చెప్పిందని సికింద్రాబాద్ లోని యువకులు సంబరాలు జరుపుకున్నారు.పార్టీలకతీతంగా యువకులంతా ఏకమై త్రివర్ణ పతాకాలతో సీతాఫలమండిలో ర్యాలీ నిర్వహించి, మిఠాయిలు తినిపించుకుంటూ జయజయ ధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది భాస్కర గిరి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూరం పేరిట ఈ రోజు తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో మన భారత ఆర్మీ పాకిస్థాన్ లోని 9ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి 80మంది ఉగ్రవాదులను మట్టుబెట్టిందని తెలిపారు. ఇది పహల్గాంలో అమరులైన టూరిస్టులపై జరిగిన దాడికి ప్రతీకార చర్య మాత్రమే కాదు, ఆ అమరులకు ఘనమైన నివాళిగా పేర్కొన్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని వేడుకున్నారు. దేశాధినేత ఎలా ఉండాలి అంటే మోడీ లాగా ఉండాలని చెప్పుకునే విధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోడీని చూసి భారతీయులంతా గర్వపడుతున్నట్లు వెల్లడించారు.

## ఆపరేషన్ సింధూర్కు మద్దతుగా భారీ కార్యక్రమం

నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆపరేషన్ సింధూర్కు మద్దతుగా భారీ కార్యక్రమం జరిగింది. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి భారత సైన్యానికి మద్దతుగా ప్రతిజ్ఞ చేసారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు పహాల్గామ్లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు.అయన మాట్లాడుతూ దేశ భద్రత కోసం ప్రజలు ఒకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. "భారతదేశం శాంతియుత దేశం, కానీ శత్రువుల దాడులకు తగిన బుద్ధి చెప్పగలదు" అనే స్పీకర్ వ్యాఖ్యనించారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో సైన్యానికి దేశవ్యాప్తంగా మద్దతు ఉన్నదని స్పీకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, యువత, మహిళలు, పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవి ఎండల్లో అకాల వానలు.. ఎందుకీ వైపరీత్యం..

హైదరాబాద్, మే 7, వేసవి కాలంలో, ముఖ్యంగా మే నెలలో, తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 42?45 డిగ్రీల సెల్సియస్‌కు చేరుతాయి. అయితే, ఈ సంవత్సరం వాతావరణంలో ఆకస్మిక మార్పులు కనిపిస్తున్నాయి. విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ప్రకారం, ఈ అసాధారణ వర్షాలకు ఆరు ప్రధాన కారణాలు ఉన్నాయి.

ఉపరితల ద్రోణులు, ఆవర్తనాలు:

ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బంగాళాఖాతం ప్రాంతాల్లో ఏర్పడే ఉపరితల ద్రోణులు తెలుగు రాష్ట్రాల్లో ఈదురుగాలులు, వర్షాలకు కారణమవుతున్నాయి.

అల్పపీడన ప్రభావం: బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు ఆకస్మిక వర్షాలు, పిడుగులను తెస్తున్నాయి.

అధిక ఉష్ణోగ్రతలు: అధిక ఉష్ణోగ్రతలు సాయంత్రం వేళల్లో వాతావరణ అస్థిరతను సృష్టించి, వర్షాలకు దారితీస్తున్నాయి.

స్థానిక వాతావరణ అస్థిరత: సముద్రం నుంచి వచ్చే తేమ వాయువులు, ఉష్ణోగ్రతల వ్యత్యాసాలు స్థానికంగా వర్షాలను ప్రేరేపిస్తున్నాయి.

సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల: బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం తేమ స్థాయిలను పెంచి, వర్షాలకు కారణమవుతోంది.

అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్: హైదరాబాద్, విశాఖపట్టణం వంటి నగరాల్లో పట్టణీకరణ వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, సాయంత్రం వర్షాలు కురుస్తున్నాయి.

అకాల వర్షాల ప్రభావం..

ఈ ఆకస్మిక వర్షాలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర ప్రభావం చూపాయి. ఆంధ్రప్రదేశ్‌లో పిడుగులు, ఈదురు గాలుల కారణంగా 8 మంది మరణించారు, వీరిలో తిరుపతి, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో బాధితులు ఉన్నారు. తెలంగాణలో భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

పంట నష్టం: మామిడి, అరటి, బొప్పాయి, వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నూజివీడులో 100 ఎకరాలకు పైగా మామిడి పంట నష్టపోగా, చిత్తూరు జిల్లాలో వర్షాలు, గాలులు మామిడి రైతులకు నష్టం కలిగించాయి. తెలంగాణలో 25,000 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు అధికారులు అంచనా వేశారు.

ధాన్యం నష్టం: కొనుగోలు కేంద్రాల్లో ఉన్న 5,000 టన్నుల ధాన్యం తడిసి నాశనమైంది.

మౌలిక సదుపాయాల నష్టం: తెలంగాణలో చర్లపల్లి రైల్వే స్టేషన్, సిద్ధిపేటలోని టోల్ గేట్ పైకప్పులు గాలులకు దెబ్బతిన్నాయి.

ప్రాంతాల వారీగా వర్షాల తీవ్రత

ఆంధ్రప్రదేశ్: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. కాకినాడలో మే 4న 100.5 మి.మీ. వర్షపాతం రికార్డయింది. ప్రకాశం, కృష్ణా, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.

తెలంగాణ: ఖమ్మం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో సాయంత్రం వేళల్లో తేలికపాటి వర్షాలు, ఉదయం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మరో మూడు రోజులు..

వాతావరణ శాఖ ప్రకారం, ఈ పరిస్థితి మరో 2?3 రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు, విశాఖపట్టణం, కాకినాడ జిల్లాల్లో భారీ వర్షాలు, ఇతర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.

వేసవిలో వర్షాలు సాధారణమేనా?

వేసవి కాలంలో తేలికపాటి వర్షాలు కురవడం అసాధారణం కాదు, అయితే ఈ సంవత్సరం వర్షాల తీవ్రత మరియు పరిమాణం సాధారణం కంటే ఎక్కువగా ఉన్నాయని వాతావరణ నిపుణులు తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనాలు, సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల, స్థానిక వాతావరణ అస్థిరతలు ఈ వర్షాలకు కారణమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్) కారణంగా ఇటువంటి ఆకస్మిక వాతావరణ సంఘటనలు పెరుగుతున్నాయి. ఈ ధోరణి భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ అకాల వర్షాలు, పిడుగులు ప్రమాదకరంగా మారుతున్నందున, ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచిస్తోంది.

పిడుగు హెచ్చరికలను గమనించండి: వాతావరణ శాఖ జారీ చేసే రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను అనుసరించండి.

బహిరంగ ప్రదేశాలను నివారించండి: వర్షం, పిడుగుల సమయంలో చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో నిలబడకండి.

వ్యవసాయ రక్షణ చర్యలు: రైతులు పంటలను రక్షించడానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం, తాటాకు షీట్లతో కప్పడం వంటి చర్యలు తీసుకోవాలి.

విద్యుత్ జాగ్రత్తలు: ఈదురు గాలుల సమయంలో విద్యుత్ లైన్లు, పరికరాల నుంచి దూరంగా ఉండండి.

ప్రభుత్వ సహాయం: పంట నష్టం జరిగిన రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి.తెలుగు రాష్ట్రాల్లో వేసవి కాలంలో సంభవిస్తున్న అకాల వర్షాలు వాతావరణ మార్పుల ఫలితంగా రైతులకు, సామాన్య ప్రజలకు సవాళ్లను తెచ్చిపెడుతున్నాయి. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడం, ప్రభుత్వ హెచ్చరికలను పాటించడం అత్యవసరం. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు దీర్ఘకాలిక వ్యూహాలు, సాంకేతికతలను అవలంబించడం ద్వారా ఈ సవాళ్లను అధిగమించవచ్చు

# ఏం మాయ చేశావో రేవంత్...



హైదరాబాద్, మే 7,తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జాయింట్ యాక్షన్ కమిటీ మే 7, 2025 నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసింది. రవాణా శాఖ మంత్రితో జరిగిన చర్చలు సఫలమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, డిమాండ్లు నెరవేరకపోతే భవిష్యత్తులో మళ్లీ సమ్మెకు దిగుతామని జేఏసీ హెచ్చరించింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమ్మెను నివారించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన వ్యూహంలో బహిరంగ విజ్ఞప్తులు, ఆర్థిక సంక్షోభం గురించి స్పష్టత, చర్చలకు తలుపులు తెరవడం ఉన్నాయి రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ, ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల బాటలో ఉందని, సమ్మె వల్ల సంస్థకు, రాష్ట్రానికి నష్టం జరుగుతుందని అన్నారు. ఆర్టీసీని "మీ సంస్థ"గా అభివర్ణిస్తూ, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని చెప్పారు.ఆర్థిక సంక్షోభం వివరణ: రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉందని, నెలకు రూ.18,500 కోట్ల ఆదాయంలో రూ.6,500 కోట్లు అప్పుల చెల్లింపుకు, రూ.6,500 కోట్లు జీతాలు, పెన్షన్లకు ఖర్చవుతున్నాయని వివరించారు. రాష్ట్రానికి కనీసం రూ.22,500 కోట్లు అవసరమని, ప్రస్తుతం రూ.12,000 కోట్ల లోటు ఉందని తెలిపారు. ఈ పరిస్థితిలో సమ్మె సరైన నిర్ణయం కాదని వాదించారు.: సమస్యలను చర్చించడానికి రవాణా మంత్రితో సంప్రదించాలని, ప్రభుత్వం లాభాలను కార్మికుల చేతుల్లో పెడతామని, వాటిని ఎలా ఉపయోగించాలో సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సానుకూల వైఖరి కార్మికులలో విశ్వాసం కలిగించింది. రేవంత్ రెడ్డి ఈ విధంగా భావోద్వేగ, ఆర్థిక, మరియు రాజకీయ కోణాలను సమర్థవంతంగా ఉపయోగించి సమ్మెను తాత్కాలికంగా నివారించారు.సమ్మె వాయిదా వెనుక చర్చలు, ఒత్తిళ్లు, మరియు వ్యూహాత్మక నిర్ణయాలు ఉన్నాయి. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చలు నిర్ణయాత్మకంగా ఉన్నాయి. ఈ చర్చలకు ముందు, ఏంఅ సమ్మెకు పూర్తిగా సిద్ధమై, హైదరాబాద్‌లో కవాతు నిర్వహించి, తమ ఐక్యతను చాటింది. అయితే, ప్రభుత్వం చివరి నిమిషంలో చర్చలకు ఆహ్వానించడం, హామీలు ఇవ్వడం వల్ల ఏంఅ సమ్మెను వాయిదా వేసింది. సమ్మె ఒత్తిడి మధ్య, ప్రభుత్వం ఆర్టీసీతో సహా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులుతో కమిటీ ఏర్పాటు చేసింది.

పరిష్కారానికి హామీలు..

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ ఏంఅ నేతలు జరిపిన చర్చలు జరిపారు. ఇందులో సానుకూల ఫలితాలను ఇచ్చాయి. ప్రభుత్వం ఇచ్చిన కీలక హామీలు ఇవీ.

ఆంక్షల ఎత్తివేత: ఆర్టీసీ యూనియన్లపై ఉన్న ఆంక్షలను తొలగిస్తామని హామీ.

ఖాళీల భర్తీ: ఆర్టీసీలో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని హామీ.

ఉద్యోగ భద్రత: ఉద్యోగ భద్రతకు సంబంధించి సర్క్యులర్ జారీ చేస్తామని హామీ.

విద్యుత్ బస్సుల సమీకరణ: కేంద్రం నుంచి రాయితీపై విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అందజేస్తామని హామీ.

కారుణ్య నియామకాలు: కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపడతామని హామీ.

ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే విషయంలో సానుకూలంగా స్పందించారు.ఈ హామీలపై నమ్మకంతో ఏంఅ తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేసింది. అయితే, ఈ హామీలు అమలులో స్పష్టత లేకపోతే, మళ్లీ సమ్మెకు దిగుతామని ఏంఅ చైర్మన్ వెంకన్న స్పష్టం చేశారు.గత నెలలో, ఆర్టీసీ ఏంఅ తమ 21 డిమాండ్లు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, జీతాల సవరణ, బకాయిల చెల్లింపు వంటివి నెరవేర్చకపోవడంతో మే 6, 2025 అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మరియు లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో సమ్మె నిర్ణయం తీసుకున్నారు. అయితే, ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని, మే 6న చర్చలకు ఆహ్వానించడం వల్ల సమ్మె తాత్కాలికంగా నిలిచిపోయింది.ఆర్టీసీ సమ్మెతోపాటు, తెలంగాణలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సీనియర్ ఐఏఎస్ అధికారులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, మరియు కృష్ణ భాస్కర్ ఉన్నారు. ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, వారి సమస్యలపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ చర్య ఆర్టీసీతో సహా ఇతర రంగాల ఉద్యోగుల సమస్యలను దీర్ఘకాలంలో పరిష్కరించే దిశగా ఒక అడుగుగా చూడవచ్చు.సమ్మె వాయిదాతో లక్షలాది మంది ప్రయాణికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ బస్సులపై ఆధారపడే విద్యార్థులు, ఉద్యోగులు, మరియు చిన్న వ్యాపారులకు ఈ నిర్ణయం తాత్కాలిక ఉపశమనం కలిగించింది. అయితే, ఏంఅ సమ్మెను పూర్తిగా రద్దు చేయకుండా తాత్కాలికంగా వాయిదా వేయడం, డిమాండ్ల అమలుపై ఒత్తిడిని కొనసాగించే వ్యూహంగా కనిపిస్తోంది.

# రేవంత్ ఫ్రస్టేషన్ దేనికి

హైదరాబాద్, మే 7, " నన్ను ఎవడూ నమ్మడం లేదు. అప్పులు పుట్టే పరిస్థితి లేదు. చివరికి బ్యాంకులు కూడా దొంగలను చూసినట్టు చూస్తున్నాయి. ఏ ప్రజా పథకం రద్దు చేయాలో మీరే చెప్పండి. వస్తున్నా ఆదాయం పింఛన్లకు, జీతాలకు, పాత అప్పుల వడ్డీలు కట్టడానికే సాలుతోంది"ఇవీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై చేసిన వ్యాఖ్యలు. ఒక రకంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసినట్టుగా ఆయన ప్రకటించారు.. ఇది రేవంత్ రెడ్డి అనుభవలేమి, కెసిఆర్ చేసిన రుణాలకు ఇది ఒక మచ్చ తునక. అయితే రేవంత్ రెడ్డి పదేపదే కేసీఆర్ వల్లే ఇదంతా అని చెప్తే జనాలు నమ్మే పరిస్థితి లేదు. స్థూలంగా చెప్పాలంటే ఇది రేవంత్ రెడ్డి చేత కానితనానికి నిదర్శనం. "వాస్తవానికి మూడు లక్షల కోట్ల అప్పు ఉందని అప్పుడు చెప్పారు. ఇప్పుడేమో అది 8.5 లక్షల కోర్టుగా కనిపిస్తోందని" రేవంత్ రెడ్డి నిర్వేదం వ్యక్తం చేస్తున్నాడు. ఇది ఒక రకంగా డిబేటబుల్ ప్రశ్న అయినప్పటికీ.. ఎన్నికల సమయంలో అన్ని హామీలు ఇచ్చినప్పుడు రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆర్థిక పరిస్థితి గురించి అవగాహన లేదా.. అంటే జనం ఓట్లు వేసిన తర్వాత.. తీరికగా ఇలాంటి సమాధానం చెబుదామని అనుకున్నారా.. జనాన్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఇలా మాట్లాడటం దీనికి సంకేతం.. అసలు ఈ జాబితాలో భారత రాష్ట్ర సమితి.. కాంగ్రెస్ పార్టీ రెండూ ఒకే తానులో ముక్కలు కదా. 2023 ఎన్నికల్లో కేసీఆర్ కూడా ఇలాంటి పథకాలే బొచ్చెడు అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టాడు. పోనీ అధికారంలోకి వస్తే కేసీఆర్ వీటన్నిటిని అమలు చేసేవాడా? తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే సత్తా లేదని రేవంత్ రెడ్డి అంటున్నాడు. ఇదే మాట మీద రేవంత్ రెడ్డి నిలబడి ఉంటాడా.. దాదాపు అసాధ్యం. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి కొంతలో కొంత ఆర్థిక సర్దుబాటు ఇచ్చే రాష్ట్రం తెలంగాణ మాత్రమే. కర్ణాటక నుంచి పెద్దగా ఫాయిదా లేదు. హిమాచల్ ప్రదేశ్ నుంచి అంతగా హార్దిక భరోసా ఉండదు. సో ఏతా వాతా చూస్తే రేవంత్ రెడ్డి కంటే ముందు మీనాక్షి నటరాజన్ తెర ముందుకు వస్తుంది.. అధికారులతో భేటీలు పెడుతుంది. అధికారం ముఖ్యం.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రేవంత్ రెడ్డి ముందు ఒక ఫైల్ పెడుతుంది. చివరికి ప్రభుత్వమే రాజీ పడాలి. సరెండర్ అవ్వాలి. ఎందుకంటే ఉద్యోగులతో ఏ ప్రభుత్వం కూడా యుద్ధాన్ని కోరుకోదు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భవిష్యత్తులో చేసేది కూడా అదే.తమిళనాడు ముఖ్యమంత్రిగా జయ లలిత ఉన్నప్పుడు.. ప్రభుత్వ ఉద్యోగులకు చుక్కలు చూపించింది. ఉద్యోగులను తన కాళ్ళ మీద పడేవిధంగా చేసుకుంది. అయితే ఈ ఉదంతం రేవంత్ రెడ్డికి తెలియదా? రేవంత్ రెడ్డికి ఎవరూ చెప్పడం లేదా.. ఒకవేళ చెప్పిన రేవంత్ రెడ్డి వినిపించుకునే పరిస్థితి లేదా.. ప్రభుత్వ ఉద్యోగులు అంటే ఈ రాష్ట్రమనే కాదు దేశంలోని అని రాష్ట్రాలకూ ఒకరకంగా వాళ్ళు అల్లుళ్లు. ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పటికీ.. లోకం సర్వనాశనమైనా సరే.. రైతులు ఆత్మహత్య చేసుకున్నా.. మిడిల్ క్లాస్ ప్రజలు కన్నీళ్లు పెడుతున్నా.. నిరుద్యోగులు అవస్థలు పడుతున్నా.. జానే దాన్. ఎవడు ఎక్కడికి పోయినా పర్వాలేదు.. మేం చల్లగా ఉంటే చాలు అనుకునే ధోరణి ఉద్యోగులది.. ఇంత స్థాయిలో జీతాలు తీసుకుంటున్నప్పటికీ ఉద్యోగులలో జవాబు దారితనం ఉందా అంటే? వీసమెత్తు కూడా ఉండదు. పైగా ఉద్యోగుల జీతాల కోసమే రాష్ట్రాల ఆదాయంలో పావు వంతు వెళ్తోంది.. అనేక కేసుల్లో పట్టుబడుతున్నప్పటికీ ఉద్యోగ సంఘాల నాయకులు తాము పనితీరు మార్చుకుంటామని.. అవినీతికి పాల్పడమని ఇంతవరకు చెప్పిన దాఖలాలు లేవు. పోనీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లించిన రేవంత్ రెడ్డి ఉద్యోగుల మీద ఎప్పుడైనా దృష్టి సారించాడా? లేదా అవినీతి కేసుల్లో సీరియస్ గా ఎఫర్ట్ పెట్టాడా? ఇంతవరకు ఒక్కరికైనా శిక్ష పడిందా? కనీసం ఒక అవినీతి అధికారైన జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడా.. వందల కోట్లు మింగినా.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినా.. ఇప్పటికీ అదే డిపార్ట్మెంటల్ ఎంక్వయిరీ పేరుతో కేసుల్ని పక్కదారి మళ్ళి ప్రయత్నమే జరుగుతుంది. చివరికి అవినీతి కేసుల్లో ఇరుక్కుపోయిన ఉద్యోగులను అదే పోస్టులలో నియమించి తరిస్తోంది ఈ ప్రభుత్వం. ప్రక్షాళన పక్కనపెట్టి.. చేయాల్సిన పనులను పక్కనపెట్టి.. నన్ను కోసుకున్నా రూపాయి కూడా లేదని రేవంత్ రెడ్డి చెప్పడం నిజంగా పాలన లేమితనం.. ఇక్కడ కేసీఆర్ గొప్పోడని కాదు. ఆయనేం శుద్ధ పుస అని కాదు. ఈ జాబితాలో అటు రేవంత్ రెడ్డి.. ఇటు కెసిఆర్ దొందూ దొందే!

# అమ్మకానికి గోల్కొండ బ్లూడైమండ్

హైదరాబాద్, మే 7, గోల్కొండ గనుల్లో లభ్యమైన ఒక అపురూపమైన రాయల్ డైమండ్‌ను మే 14న జెనీవాలో వేలం వేయనున్నారు. 3.24 క్యారెట్ల ఈ నీలిరంగు వజ్రపు ఉంగరం న్యూయార్క్‌లోని క్రిస్టీస్ జ్యుయెలరీ షాప్ ద్వారా వేలం వేస్తారు. ఈ వజ్రం పియర్ ఆకారంలో 23.24 క్యారెట్ల బరువుతో ఉంటుంది.ఒకప్పుడు ఈ ఉంగరం ఇండోర్ మహారాజుదని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యుయెలరీ చీఫ్ రాహుల్ కడాకియా తెలిపారు. ఇలాంటి ఉంగరం ఇంతకు ముందు ఎప్పుడూ వేలానికి రాలేదని ఆయన పేర్కొన్నారు. ఈ వేలంలో దీని ధర సుమారు రూ. 300 కోట్ల నుంచి రూ. 430 కోట్ల మధ్య పలకవచ్చని ఆయన అంచనా వేశారు.ఇలాంటి అత్యంత అరుదైన, విలువైన వజ్రాలు జీవితంలో ఒక్కసారే వేలానికి వస్తాయని రాహుల్ కడాకియా అన్నారు. తమ ప్రపంచ సంస్థ క్రిస్టీస్ గత 259 సంవత్సరాలుగా పనిచేస్తోందని ఆయన వెల్లడించారు. ఇన్నేళ్లలో క్రిస్టీస్ ప్రపంచంలోని చాలా ప్రసిద్ధమైన, ముఖ్యమైన వజ్రాలను విక్రయించిందని ఆయన చెప్పారు.తమ వేలంలో గతంలో అమ్ముడైన గోల్కొండ వజ్రాలకు ఉదాహరణలుగా పలు డైమండ్ల పేర్లను ఆయన వివరించారు. ఆర్చ్‌డ్యూక్ జోసెఫ్ డైమండ్, ప్రిన్సీ డైమండ్, విట్టెల్స్‌బాచ్ డైమండ్ వంటి వాటిని తాము విక్రయించామని ఆయన గుర్తు చేశారు. రాజరికపు వారసత్వం, అసాధారణమైన రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన నీలి రంగు వజ్రాలలో ఒకటని రాహుల్ కడాకియా ఒక ప్రకటనలో తెలియజేశారు.క్రిస్టీస్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ఒకప్పుడు ఇండోర్ మహారాజా యశ్వంత్ రావు హోల్కర్ ఎఎది. 1923లో మహారాజు తండ్రి ఈ వజ్రంతో ఒక బ్రాస్‌లెట్‌ను తయారు చేయించడానికి ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత లగ్జరీ ఆభరణాల బ్రాండ్ చౌమెట్‌కు ఆర్డర్ ఇచ్చారు. అంతకు ముందు అదే ఆభరణాల సంస్థ నుంచి "ఇండోర్ పియర్స్" అనే రెండు గోల్కొండ వజ్రాలను ఆయన కొనుగోలు చేశారు.

పదేళ్ల తర్వాత మహారాజు ప్రసిద్ధ ఫ్రెంచ్ లగ్జరీ ఆభరణాల కంపెనీ మౌబౌసిన్‌కు మరొక ఆర్డర్ ఇచ్చారు. ఈ కంపెనీ 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను తిరిగి రూపొందించి ఇండోర్ పియర్ వజ్రాలతో కలిపి ఒక హారంలో చేర్చింది.న్యూయార్క్‌కు చెందిన ప్రసిద్ధ ఆభరణాల వ్యాపారి హ్యారీ విన్‌స్టన్ 1947లో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను కొన్నారు. ఆయన ఈ నీలి వజ్రాన్ని అదే పరిమాణంలో ఉన్న మరో తెల్ల వజ్రంతో కలిపి ఒక బ్రూచ్‌ను తయారు చేశారు. ఆ తర్వాత ఆ బ్రూచ్ బరోడా మహారాజుకు చేరింది. కొంతకాలం తర్వాత ఆ బ్రూచ్‌ను ఆ రాజకుటుంబం ఒక ప్రైవేట్ వ్యక్తికి విక్రయించింది. ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.

## రాష్ట్రం ఒక గొప్ప నాయుకుడిని కోల్పోయింది

రాయచోటి రాష్ట్రం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని, రాయచోటి టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ రాయుడు మరణం టిడిపి కి, జిల్లా ప్రజలకు తీరని లోటు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. వారు అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణానికి చేరుకుని టిడిపి సీనియర్ నేత, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ రాయుడు భౌతిక గాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాలకొండ రాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కేవలం ప్రజల కోసమే సుగవాసి పాలకొండ రాయుడు తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన వ్యక్తి గొప్ప వ్యక్తిని అన్నారు. నాలుగు శతాబ్దాలుగా రాజకీయ జీవితం అనుభవించిన గొప్ప నాయకుడు పాలకొండ రాయుడు అని అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ప్రజలకు సేవలందించారనీ గుర్తు చేశారు. ప్రజల కోసమే మొదటినుంచి తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పాలకొండ రాయుడు అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు పాలకొండ రాయుడు కుటుంబాన్ని పరామర్శించడం జరిగిందన్నారు. టిడిపి తరపున, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ల తరుపున పాలకొండ రాయుడు మరణం పట్ల సంతాపం తెలియజేస్తున్నామన్నారు. పాలకొండ రాయుడు కుటుంబానికి ఎల్లప్పుడూ టిడిపి అండగా ఉంటుందని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు వల్ల శ్రీనివాసరావు లు తెలిపారు.

## పలు ఉత్తరాది ప్రాంతాల విమానాలను రద్దు చేసిన ఎయిర్ ఇండియా

రంగారెడ్డి ఇండియా పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ప్రముఖ ఎయిర్ ఇండియా కంపెనీ ఈరోజు నుండి శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుండి జమ్మూ, శ్రీనగర్, లేహ్, జోద్పూర్, అమృత్సర్, భుజ్, జాంనగర్, చండీగఢ్, రాజ్కోట్ ప్రాంతాలకు తమ విమాన సర్వీసు నిలిపివేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ట్విట్టర్ లో పోస్ట్ చేసింది. అమృత్సర్ నుండి విదేశాలకు వెళ్లే రెండు అంతర్జాతీయ విమానాలను కూడా ఢిల్లీ కి ఎయిర్ ఇండియా అధికారులు మార్చారు. ప్రస్తుతం యుద్ధమేఘాల పరిస్థితుల్లో ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది.

# మేడ్చల్ రైల్వే స్టేషన్ ముందు సిఐటియూ ధర్నా

మేడ్చల్ రైల్వే రంగాన్ని ప్రైవేటుపరం చేయొద్దని సిఐటియు ఆధ్వర్యంలో మేడ్చల్ రైల్వే స్టేషన్ ముందు సిఐటియు నాయకులు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఎం.నరేష్ మాట్లాడుతూ తక్కువ ఖర్చు గల రవాణా మార్గం, రైలు ప్రయాణం సాహిన్య ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, ముఖ్యంగా వలస కార్మికుల జీవితాలతో విడదీయలేనిదన్నారు. రోజుకు కోటీ యాభై లక్షల మందికి రవాణ సౌకర్యంగా ఉన్న రైల్వే రంగాన్ని పటిష్టంగా అమలు జరపకుండా ప్రభుత్వం బాధ్యత నుండి తప్పించుకుంటోందని ఆరోపించారు. కోవిడ్ తరువాత సాధారణ పాసెంజర్ రైళ్ల ను బాగా తగ్గించారని సుమారు 160 సర్వీసులు నిలిపివేశారని ఎక్స్ ప్రెస్ రైళ్లలో సాధారణ కంపార్ట్మెంట్ల సంఖ్య తగ్గిపోయిందని. వాటిస్థానంలో వందేభారత్ రైళ్లు మరియు డైనమిక్ ఛార్జీలు వంటి ఖరీదైన రైళ్లు ప్రవేశపెట్టారు విమర్శించారు. సీనియర్ సిటిజన్లు, పిల్లలు, వికలాంగులు మొదలైన వారికి ఇచ్చే రాయితీలు తొలగించబడ్డా యని రైల్వే స్టేషన్లు, రైళ్లు, ట్రాక్లు మొదలైనవి. గూడ్స్ షెడ్లు మొదలైన వాటి నిర్వహణ, పరిపాలన ప్రైవేటు కాంట్రాక్టర్లు కట్టబెడుతున్నారని ఆరోపించారు. 90 శాతం రైళ్లు, రైల్వేస్టేషన్లలో కనీస వసతులు లేవని. చర్లపల్లి వంటి రైల్వేస్టేషన్ లను అధునీకరించి సర్వీస్ చార్జీల పేరుతో దిగువ మధ్యతరగతి, సామాన్య ప్రజలపై, భారాలు మోపుతున్నారని. పార్కింగ్ ఫీజులు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొందని అన్నారు.రైల్వే ప్రైవేటికరణ వల్ల సరుకు రవాణా ఛార్జీలు పెరగటంతో వస్తువుల ధరలు పెరుగుతాయని. భద్రత పట్ల నిర్లక్ష్యం, కార్పొరేట్లకు లాభాలు పెంచటం కోసం రైల్వేలను కేంద్ర ప్రభుత్వం బరితెగించి ప్రైవేటీకరిస్తున్నదని ఆరోపించారు, రైల్వేల ప్రైవేటీకరణను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కే.నర్సింగ్ రావు, ప్రశాంత్, రమేష్, కొమురయ్య, చెంద్రశేఖర్, ప్రేమలత, విజయలక్ష్మి, పూజ, వసంత, జ్యోతి, లత, మహేశ్వరి, చంద్ర, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా , మే 7 ప్రజాబలం ప్రతినిధి**రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. నిన్నటి రోజు కెటిఆర్ బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం.రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదాలో రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్తే దానిని బిజెపి బిఆర్ఎస్ వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు.కెటిఆర్,బండి సంజయ్ మాటలు కోటలు దాటుతున్నాయి.గత ప్రభుత్వం చేసిన అప్పులను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే గత అసెంబ్లీ సమావేశంలో చెప్పడం జరిగింది. ఇష్టను సారంగా వారు మాట్లాడిన మాటలను తప్పుపడుతున్నాం.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా దుబ్బారా ఖర్చు చేయకుండా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం జరిగింది.ఆడంబరాలకు పోకుండా ప్రతినిత్యం 18 గంటల కష్టపడుతూన్నారు.ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నాం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు వారు కట్ కట్ చేసి ప్రచారం చేస్తున్నారు.మేము రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ లు పెడితే బిఆర్ఎస్, బీజేపీ వారు వాట్స్ అప్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేస్తున్నారు.వారు దుబాయ్ కేంద్రంగా విద్వేశపు వాట్స్ అప్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేస్తున్నారు.ఆ నలుగురు తెలంగాణ రాష్ట్రన్ని ధనిక రాష్ట్రం అనీ గొప్పలు చెప్పారు.వాళ్ళ తీరు బహార్ శార్వాణి అందరు పరశని అన్నట్లు ఉంది.బిఆర్ఎస్ బీజేపీ కి బి టీం గా ఉంది.గతంలో బిఆర్ఎస్ వారు ధనిక రాష్ట్రం అంటే బిజెపి వారు ఎందుకు కండినచ్చలేదు.కాళేశ్వరం పేరిట తెలంగాణ సంపద దోచుకున్నారు.రాష్ట్ర ఆదాయాన్ని పెంచే మార్గాలు ప్రజా ప్రభుత్వంలో చేపదుతున్న%శీ%.మీరు అడ్డుకట్ట వేస్తున్నారు.కంచ గచ్చి భూమల విషయంలో కూడా ప్రభుత్వం పై ఆరోపణలు చేశారు.కిసాన్ రెడ్డి కంచ గచ్చీ భూముల విషయం పై సోషల్ మీడియా లో పెట్టిన పోస్టాలను ఎందుకు తీసివేశారు.విభజన హామీలను ఏమయ్యాయి.బీజేపీ అసమర్థత కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది.బండి సంజయ్ కేంద్రం నుండి నిధులు తీసుకురావాలి.రోడ్డు వేసామని గొప్పలు చెప్పున్నారు మీరూ రోడ్డు వేసి టోల్ ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారు.బిసి కుల గణన మేము చేస్తే కుల సర్వే అంటున్నారువాళ్ళు ఏం మాట్లాడుతున్నారో వారి విజ్ఞత కే వదిలేస్తున్నాం.రాహుల్ గాంధీ చెప్పినట్లు గా దేశమంతా కుల గణన చేసి తీరాల్సిందే.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హెూదాలో డిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయడం జరిగింది.బిఆర్ఎస్ వారు బిసి ల కుల గణనలో ఎందుకు పాల్గొనలేదు.ఆనాడు ధర్నా చేస్తే 50 మంది ఎంపీలు, 15 రాష్ట్రాల బీసీ సంఘం నేతలు రావడం జరిగింది.ఎస్సి వర్గీకరణ అమలు చేయడం జరుగుతుంది.కవిత బిసి లకు నాయకత్వం వహించాలని అవసరం లేదు.ఆర్టీసీ బస్సు లో ఉచిత ప్రయాణం,500 సిలిండర్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం.గత ప్రభుత్వం హయంలో ఏ రంగానికి కూడా పాలసీ లేదు.ప్రజా ప్రభుత్వంలో అన్ని రంగాలకు పాలసీ లు చేస్తున్నాం.మీరు హెలికాప్టర్ వాడితే తప్పులేదు.మా మంత్రులు వాడితే తప్పా.ఆనాడు మీరు, మీ నాన్న హెలికాప్టర్ ఎక్కి కరీంనగర్ సిరిసిల్లలో దిగవచ్చు కానీ మా మంత్రులు వాడితే మీకు నచ్చడం లేదా.మీకు ఇంత అహకరం ఎందుకు.బీజేపీ బీఆర్ఎస్ రెండు ఒకటే.ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పెరిట ముందుకు పోతే చూస్తూ ఓర్వలేక పోతున్నారు.బండి సంజయ్ నిన్నటి రోజున ఎల్లారెడ్డి పేటలో వారు కేంద్ర మంత్రిగా మాట్లాడినా మాటలు ఖండిస్తున్నాం.బండి సంజయ్ వాస్తవాలు తెలుసుకోవాలి.ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేస్తున్నాం.బిఆర్ఎస్ హయంలో 2021-22 లో 6%ష్ట్ర% మే వరకు 1215 మెట్రిక్ టన్నుల,2022-23 లో మే 6 వరకు 32915 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రజా ప్రభుత్వంలో 2023-24 6 మే వరకు 91560 మెట్రిక్ టన్నుల ధాన్యం,2024 ఇప్పటి మే 6 వరకు 112405 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది.రైతులు తేడాను గమనించాలి.రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.రేవంత్ రెడ్డి రైతును రాజుగా చేయాలనీ ముందుకు పోతున్నాం.వర్షానికి తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం.సన్నం వడ్లను కూడా కొనుగోలు చేయడం జరుగుతుంది.తూకం వేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుంది.జిల్లా కలెక్టర్ నాయకత్వంలో వడ్ల కొనుగోలు వేగంగా కొనసాగుతున్నాయి అని ఆయన అన్నారు.

## విద్యుత్ శాఖలో అందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలి
## ఈ పి ఎఫ్ నుండి జి పి ఎఫ్. చేయాలి
## TGUEEU-CITU.



**ఖమ్మం ప్రతినిధి మే 7 (ప్రజాబలం)**ఖమ్మం విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులకి కార్మికులకి ఆర్టిజన్ అందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఖమ్మం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ ఆఫీసు నందు దరఖాస్తు ఇవ్వడం జరిగినది శాఖలో చాలా తక్కువ మంది ఉద్యోగులు ఉన్నారని నిరంతరం కష్టపడి పని చేస్తున్నారని అహర్నిశలు కష్టపడి పనిచేసే ఉద్యోగులకు అందరికీ టెన్షన్ సౌకర్యం కల్పించాలని ఈపీఎఫ్ నుండి జి పీఎఫ్ కి మార్చాలని డిమాండ్ చేస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయడం జరుగుతుంది అని ఖమ్మం జిల్లా కమిటీ పేర్కొన్నది. ఇదే రోజు కార్మికుల హక్కుల కోసం పనిచేసిన మాజీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కి నివాళులు అర్పించడం జరిగినది ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం .ప్రసాద్ జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు. జిల్లా నాయకులు గంట శ్రీనివాసరావు ఎల్వి కృష్ణారావు రాధ తదితరులు పాల్గొన్నారు

## శత్రుపూరిత పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..
## బాలానగర్ డిసిపి సురేష్ పిలుపు




**కూకట్పల్లి (ప్రజబలం) మే 07** :శత్రుపూరిత పరిస్థితులను, శత్రువుల దాడుల ఎదుర్కోవడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ డిసిపి సురేష్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు బుధవారం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమానికి బాలానగర్ డిసిపి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపి సురేష్ కుమార్ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. ఇండ్లపై జరిగే దాడుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జనసందోహం ఎక్కువగా ఉన్నటువంటి హెూటళ్ళు, సినిమహాళ్ళు, ఫంక్షల్ హాల్లో కుందురంగా ఉండాలని కోరారు. అధికారిక వర్గాల నుండి వచ్చే సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని మూలాలపై ఆధారపడవద్దని సూచించారు. విధులను నిర్వహిస్తున్న పోలీసులు, మిలిటరీ అధికారులు, వాయు సేన అధికారుల ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టవద్దని కోరారు. స్థానిక కాలనీలు, బస్తీల్లో ఎక్కడైనా అలజడులు, సంఘటనలు జారితే ముందుగా ప్రజలను ఇళ్ల నుండి దూరంగా తరలించాలని, కంగారు పడకుండా సమాచారాన్ని పోలీసులకు లేదా డయల్ 100 కు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాయుసేన అధికారులు, బాలానగర్ ఎసిపి హనుమంత రావు, బాలానగర్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు, ట్రాఫిక్ సిఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని, సైన్యానికి అందరూ అండగా నిలుద్దాం!

### సామాన్యులను అసామాన్యులుగా మార్చిన పార్టీ టిడిపి
### కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకోం
### ఇకపై కెఎస్ఎస్ లో ఉన్నవారికే నామినేటెడ్, పార్టీ పదవులు
### సత్యవేడు ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్








సత్యవేడు: ఈరోజు మనందరం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం, అయితే మనవద్ద నమో (నరేంద్ర మోడీ) మిసైల్ ఉంది. ప్రధాని మోడీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు,

భారత సైనికులు పాకిస్థాన్ పైకి వెళ్లి స్ట్రయిక్స్ చేస్తున్నారు, ఉగ్రవాదులపై ఆపరేషన్ సింధూర్ పేరిట యుద్ధం ప్రకటించారు, రాష్ట్రమంతా ప్రధానమంత్రి, భారత సైన్యానికి అండగా నిలబడాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సత్యవేడులో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్ మాట్లాడుతూ... మనందరం తొలుత భారతీయులం, మనకోసం సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న సైనికులకు సంఘీభావం తెలపాలని అన్నారు. పాదయాత్రలో మీ అందరికీ హామీ ఇచ్చా, సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తా, పనిచేసే వారిని ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చాను, ఎప్పుడు మీ ప్రాంతానికి వచ్చినా మిమ్మల్నే ముందుగా కలుస్తానని చెప్పా. ఇచ్చిన మాట ప్రకారమే ఈరోజు ఉత్తమ కార్యకర్తలను కలిశాను. కార్యకర్తలు పార్టీ నాయకుల చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగాలి. ఈరోజు నాయకత్వం అంతా మీ ముందుకు వచ్చింది. ఇదీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే గౌరవం.

అలకలు వద్దు... మాట్లాడి పరిష్కరించుకుందాం

మన పార్టీ కేడర్ లో ఉన్న మరో జబ్బు పేరు అలక. ఇది మనపార్టీ, పార్టీలో సంస్కరణల కోసం జగన్ కంటే ఎక్కువగా నేను పార్టీలో పోరాడా. ఇది మనపార్టీ, సమస్యలు ఏవైనా ఉంటే మనం మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి. నిర్ణయాలు తీసుకునే క్రమంలో కొన్నిసార్లు సమయం పట్టవచ్చు కానీ, కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకోం.

కేడర్ సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నాం

ఇకపై పార్టీ పదవులు,నామినేటెడ్ పదవులు రావాలంటే తప్పనిసరిగా కెఎస్ఎస్ బాధ్యులుగా ఉండి తీరాలి. నిజమైన కార్యకర్తలను గుర్తించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. పార్టీ నేతలంతా కమిట్ మెంట్ తో పనిచేయాలి. మండలపార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన నిమ్మకాయల చినరాజప్పను గత ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిని చేశాం. స్కూలు టీచర్ అనితను రాష్ట్ర తెలుగుమహిళ అధ్యక్షురాలిగా, హెూంమంత్రిగా నియమించాం. కలిశెట్టి అప్పలనాయుడు టిడిపిలో సామాన్య కార్యకర్త, ఓ సాధారణ పత్రికా విలేకరి. కాల్వ శ్రీనివాసులు కూడా అలాగే వచ్చారు. వారికి ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించాం. అదే టిడిపి గొప్పతనం.

కష్టపడి పనిచేసినవారికే పదవులు ఇవ్వాలన్నది బాబుగారి లక్ష్యం. అందుకే ఉత్తమ కార్యకర్తలను గుర్తించి అవార్డులు ఇస్తున్నాం. కమిటీలను పకడ్బందీగా నియమించుకొని ముందుకెళదాం. కార్యకర్తలు మీ క్లస్టర్, యూనిట్, బూత్ పై దృష్టిసారించండి. వేరేవాళ్ల గురించి పట్టించుకోవద్దు. కార్యకర్తల కోసం జగన్ కంటే మూడురెట్లు ఎక్కువగా పార్టీలో అంతర్గతంగా పోరాడుతున్నానని పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు చెప్పా, అయితే నాలుగుగోడల మధ్యే ఆ పోరాటం ఉండాలి. పార్టీ తీసుకున్న అన్ని నిర్ణయాలతో ఏకీభవించాల్సిన పనిలేదు. అయితే పార్టీ తీసుకున్న నిర్ణయాలను మాత్రం అందరం గౌరవించి అమలు చేయాల్సిందే. 14న పోలిట్ బ్యూరోకు ప్రిపేరవుతున్నాం, కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను చర్చిస్తాం.

రెడ్ బుక్ అమలుపై డౌట్ అవసరం లేదు!

రెడ్ బుక్ పై ఎవరికీ ఎటువంటి డౌట్ అవసరం లేదు. మాటల్లోకాదు, చేతల్లో చూపుతాం. పార్టీ పిలుపు ఇచ్చిన అన్ని కార్యక్రమాలు సక్రమంగా అమలుచేయాలి. పార్టీ అధ్యక్షుడి నుంచి కెఎస్ఎస్ వరకు అందరూ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి. గత ఏడాదిగా పార్టీ పెద్దగా కార్యక్రమాలు ఇవ్వలేదు. మహానాడు తర్వాత ఎవరినీ వదలిపెట్టను, వెంటపడి పనిచేయిస్తా. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అహంకారంతో వ్యవరించకూడదు. అలా చేయబట్టే వైసిపికి 151 నుంచి 11స్థానాలు వచ్చాయి. దేశంలో బాగా పనిచేసిన పార్టీలు ఓడటానికి అహంకారమే కారణం. అహంభావాన్ని ప్రజలు తిరస్కరిస్తారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఇబ్బందులు పడతాం. వైసిపి నాయకుల తీరు ఇప్పటికీ మారలేదు, ఇప్పుడు కూడా వారు గతంలో లాగే మాట్లాడుతున్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై ప్రజల్లో చైతన్యం తేవాలి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. దొంగపేపర్, టివి తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని మంత్రి లోకేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట పట్టణంలో ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి మే 7(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సదాశివపేట:వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు సదాశివపేట పట్టణంలో ఘనంగా జరిగాయి,వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు,కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని శోభాయామానంగా అలంకరించారు,ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో సన్మానించారు,వాసవి మాత ఆర్యవైశ్యులకే కాకుండా అందరికీ ఆరాధ్య దేవత అని ఎమ్మెల్యే కొనియాడారు,కార్యక్రమంలో శివరాజ్ పాటిల్, కాసాల బుచ్చిరెడ్డి, చింత గోపాల్, అంజయ్య ,ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.ఖ

# భారత సైన్యాన్ని చూసి గర్వపడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి**:భారతదేశంలో ఉగ్రవాదానికి స్థానం లేదని సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు పాకిస్తాన్ లోని ఉగ్రవాదుల స్థావరాలు లక్ష్యంగా చేసుకొని జరిగిన ఆపరేషన్ సింధూర్ ను ప్రశంసించారు ఉగ్రవాదం అంతం కావాల్సిందే అని పేర్కొన్నారు, ప్రతి ఒక్కరు భారత సైన్యానికి ఉండగా ఉండాలన్నారు

# వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండాలని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

బుధవారం నిర్మల్ జిల్లా కుంటాల మండలం అందకూర్ గ్రామంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కేంద్రంలో టెంట్,త్రాగునీరు తదితర వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్... కొనుగోలు ప్రక్రియలో అలసత్వం కారణంగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించారు. సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి తరలించాలన్నారు. తేమ శాతం నిబంధనల మేరకే కొనుగోలు చేయాలని సూచించారు.తగినన్ని గన్ని సంచులు, టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని,ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తెలుపాలని కలెక్టర్ రైతులను కోరారు. ప్యాడీక్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరచాలని సూచించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,ఆర్డీవో కోమల్ రెడ్డి,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడా కిట్లు పంపిణీ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 07** : వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని,క్రీడాకారులు ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖాధికారి కీర్తి రాజ్ వీరు తో కలిసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు అందించిన క్రీడా కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వేసవి సందర్భంగా ప్రత్యేక క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని,విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా సెంటర్ బాక్సింగ్ కోచ్ చిలువేరు రాజేష్,ఫుట్బాల్,వాలీబాల్,కరాటే శిక్షకులు వనిత, పున్నం చందు,రవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజల అభివృద్దే మా లక్ష్యం... సురేష్ శెట్కర్, జహీరాబాద్ ఎంపీ

**ప్రస్తుతం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు చేరాలి.**
**అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు విజయవంతం చేయాలి.**
**ఎంపీ సురేష్ శెట్కర్ అధ్యక్షతన( దిశ)జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం .**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:జిల్లా ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందటమే తమ లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కర్ అన్నారు.బుధవారం ఎంపీ సురేష్ శెట్కర్ అధ్యక్షతన

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించేందుకు జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈ సమావేశానికి సహ అధ్యక్షులుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ముఖ్య అతిథులుగా, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి ,మల్క కొమురయ్య, టీజీఐఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు హాజరయ్యారు.కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ఈ సమావేశంలో సమీక్షించారు.ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం, విద్యా, ఆరోగ్య రంగాల్లో జరుగుతున్న పనులపై చర్చ జరిగింది.అధికారులచే సమర్పించబడిన వివరాల ఆధారంగా,సమస్యాత్మక అంశాలు గుర్తించబడి వాటి పరిష్కారానికి తగిన సూచనలు ఇవ్వబడ్డాయి,ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 165 నేషనల్ హైవే పనులు వెంటనే పూర్తి చేసేలా నేషనల్ హైవే అథారిటీస్ అధికారులు కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని వచ్చే సమావేశానికి నేషనల్ హైవే అధికారులు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు,జిల్లాలోని పటాన్చెరువు జహీరాబాద్ నేషనల్ హైవేలో మల్కాపూర్ వద్ద,నాందేడ్ అకోలా రహదారిలో సుల్తాన్ గురు వద్ద సంపూర్తిగా ఉన్న పనులు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో విద్య, వైద్య ,గృహ,ఆరోగ్య శాఖల అధికారులను జిల్లాలో జరుగుతున్న ఆయా శాఖల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో ప్రభుత్వ పాఠశాలను నూతనంగా నిర్మించడం కోసం ఉన్న భవనాన్ని కూల్చివేశారని భవన నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు చెట్లకుంద చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు వెంటనే పాఠశాల భవనం నిర్మించేలా విద్యాశాఖ అధికారులు ,జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చెరువులు కుంటలలో మత్స్యశాఖ ద్వారా చేపల పెంపకానికి అవసరమైన చేప పిల్లల్ని జిల్లాలోని ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.జిల్లాలో రోడ్లు భవనాల నిర్మాణంలో గల ఆలస్యానికి కారణాలు అడిగారు. వైద్య ఆరోగ్యం విషయంలో ఎలాంటి విధానాల అవలంబిస్తున్న ప్రజల కావలసిన అవసరాలను వివరించారు,జిల్లాలో గల క్రీడా మైదానాల పనితీరును క్రీడా అధికారులను అడిగి తెలుసుకున్నారు.క్రీడాపథకాల అమలులో పారదర్శకత, సమర్థత, వేగం పెంచాలని ఎంపీ సురేష్ శెట్కర్ అధికారులను ఆదేశించారు.జిల్లా.ప్రజల అభివృద్ధే లక్ష్యంగా. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి ప్రజలకు అనిత చూడాల్సిన బాధ్యత అధికారులకు ఉందన్నారు. అన్ని శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు,జిల్లాలో వ్యవసాయ, సంక్షేమ, గ్రామీణ శాఖలో గల పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు,వ్యవసాయంలో జిల్లాకు కావలసిన అవసరాలను వివరించారు. దేశాభివృద్ధిలో గ్రామాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాలకు కలిపే లింక్ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు,ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నాయన్నారు,టీజీఐఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రజలకు ఏ అవసరాలు ఉన్న ప్రభుత్వాలు తీరుస్తున్నట్లు ఆమె వివరించారు. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే చేరాలని అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలియజేశారు,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ నాయకులు అధికారుల సమన్వయంతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు,ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు తక్షణం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు,కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పి డి డి ఆర్ డి ఎ జ్యోతి,దిశ కమిటీ సభ్యులు జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణ జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 07** : జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 219 కేంద్రాలు ద్వారా 6 వేల 322 మంది రైతుల వద్ద నుండి 50 వేల 707 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 32 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని,సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 355 లారీల ద్వారా 3 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 58 మిల్లులకు,జిల్లాలోని 16 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 3 కోట్ల రూపాయల నుండి 5 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని,అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ,సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,నీడ, ఓ.ఆర్.ఎస్.గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## గౌలిపుర స్లాటర్ హౌజ్ ను పరిశీలించిన జీహెచ్ఎంసి కమిషనర్

హైదరాబాద్ పాతబస్తీ గౌలిపుర మేకల మండి కమేల స్లాటర్ హౌస్ ను జి.హెచ్.ఎం.సి. కమిషనర్ ఆర్. వి . కర్ణన్ పరిశీలించిన అనంతరం ఆరికటిక సంఘం నాయకులు. స్థానికుల తో స్లాటర్ హౌస్ నిర్మించి ఎన్ని సంవత్సరాలు అవుతుంది ప్రారంభం కాకపోవడానికి కారణాలు ఏమిటి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్. వి కర్ణాన్ . అరె కటిక సంఘం నాయకులతో స్లాటర్ హౌస్ ను త్వరలోనే ప్రారంభం కల్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ వెంకన్న. గౌలిపుర కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి .స్థానిక నాయకుల తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# సబితా ఇంద్రారెడ్డి నిర్దోషిగా తేలినందుకు సంబరాలు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 7 మే 2025**మహేశ్వరం శాసన సభ్యులు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గత 13 సంవత్సరాలుగా ఓబుళాపురం మైన్స్ కేసులో ఎదుర్కొన్న ఒడిదుడుకులకు స్వస్తి పలుకుతూ నాంపల్లి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కోర్టు సత్యమేవ జయతే నినాదాన్ని బలపరుస్తూ తనను నిర్దోషిగా తేల్చి చెప్పిన దరిమిలా ఇట్టి శుభ సందర్భములో భారత రాష్ట్ర సమితి మణికొండ మునిసిపాలిటీ కుటుంబ సభ్యులు బుధవారం రోజున ఆమెను వారి ఇంటి వద్ద కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేసి విచ్చేసిన కార్యకర్తలతో కలసి టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచడంలో భాగస్వామ్యముగా కలిసి కట్టుగా ముందుకు సాగిన సీతారం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, రూపారెడ్డి, అందే లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్ రెడ్డి, విజయలక్ష్మి, రాజేంద్ర ప్రసాద్, జై రామ్, భానుచందర్, సుమనళిని, రమణ మూర్తి, కందడ ప్రవీణ్ కుమార్, అశోక్, ఎస్.రేఖ, బిందు, మౌనేష్, మహేష్, శేఖర్, గోపి తది తరులు ఆనంద మయమైన సంబురాలు జరుపుకోవడం జరిగినది.

# పహల్గామ్ బాధిత మహిళల ప్రతీకారానికి చిహ్నమే ఆపరేషన్ సింధుర్ – దొడ్ల వెంకటేష్ గౌడ్



**కూకట్పల్లి (ప్రజబలం) మే 07** :పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది భారతీయులను ఉగ్రవాదులు అతి కిరాతకంగా చంపిన విషయం విదితమే. ఈ దాడిలో కేవలం పురుషులను మాత్రమే చంపి మహిళలకు వారి పసుపుకుంకుమలు దూరం చేసారు. ఈ బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు రంగంలోకి దిగిన భారత సైన్యం వారి నుదిటిన ఏ సింధూరాన్నైతే చెరిపేశారని ఉగ్రవాదులు విర్రవీగారో వారి మనుగడనే లేకుండా 'ఆపరేషన్ సింధూర్' పేరుతో భారత ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ బలగాలు సంయుక్తంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై మెరుపు దాడులు చేసి విజయవంతంగా ధ్వంసం చేసిన సందర్భంగా 124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ గుడ్ విల్ హొటల్ చౌరస్తాలో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ డివిజన్ నాయకులతో కలిసి భారత్ మాతాకి జై, పాకిస్తాన్ డౌన్ డౌన్ నినాదాలతో టపాసులు కాల్చి సంబురాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల కవ్వింపు చర్యలకు చూస్తూ ఊరుకున్నాం, దాడులు చేస్తున్నా సహించాం.కానీ కళ్లెదుటే కట్టుకున్న వాళ్లను కాల్చేసి దిక్కున్నచోట చెప్పుకోమంటే ఎలా ఊరుకుంటాం.ఉగ్ర దాడిలో భర్తలను కోల్పోయిన ప్రతీ మహిళ ప్రతీకారానికి చిహ్నంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా నిర్వహించిన ఇండియన్ ఆర్మీకి జోహార్లు అని అన్నారు. ఉగ్రవాదుల పేహల్గామ్ దాడికి కౌంటర్గా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా ఆల్విన్ కాలనీ లో పెద్ద ఎత్తున సంబరాలు చేపట్టాం అని తెలియచేసారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, మైనారిటీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జేఎస్ఎల్ క్రికెట్ పోటీలు

## జోగిపేటలో ఐపీఎల్ తరహాలో

## స్పాన్సర్డ్ బై మాజీ కౌన్సిలర్ నాని జోగిపేట




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 7 ప్రజాబలం )** అందోల్ మండల కేంద్రమైన జోగిపేటలో ( ఐపీఎల్ ) క్రికెట్ పోటీల మాదిరిగానే జేఎస్ఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్లు జరుగుతున్నాయి, దీనికి అందోల్ జోగిపేట మున్సిపల్ 12వ వార్డు మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు, ( నాని) స్పాన్సర్ చేయగా పట్టణంలో ఆరు టీంలు పోటీపడుతున్నాయి వీటిని కూడా 6 మంది యువకులు ఫ్రాన్ చేస్ చేశారు, ఈ జట్ల కొనుగోలు సైతం జరిగింది, ఇందులో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా 30 వేల రూపాయలు నగదు, రన్నర్ కు రెండో బహుమతిగ 20,వేల రూపాయలు ఇవ్వనున్నట్లు మాజీ కౌన్సిలర్ నాని, ప్రకటించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుముల ప్రాంతాలలో సైతం రాటు దేలిన ఆటగాళ్లు ఉన్నారని, అలాంటి వారిని గుర్తించి చేరదీస్తే అంతర్జాతీయ స్థాయిలో అడుగు పెడతారని దీంతో దేశానికి పేరు వస్తుందని ఆయన గుర్తు చేశారు, ఎందరో ఆటగాళ్లు గుర్తింపు లేక మరుగున పడిపోతున్నారని అలాంటి వారిని ఇలాంటి లిగ్ మ్యాచులు గుర్తింపు తెస్తాయని తెలియజేశారు, ఇప్పటికే మొదటి లీగ్ మ్యాచ్లు ముగిశాయని, రేపటి నుండి సెమీ ఫైనల్ జరుగుతాయని అన్నారు, ఈ మ్యాచ్లను వీక్షించడానికి మండల పరిధి నుండి అనేకమంది ఆటగాళ్లు, పాల్గొనటం విశేషం, మండల లెవెల్ లో అవకాశం ఇస్తే తాము సైతం పాల్గొనే వారమని మండల పరిధిలోని క్రికెట్ టీం సభ్యులు కోరుతున్నారు, ఏది ఏమైనా జోగిపేట ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్ పండగ జరుగుతుంది....



# మాక్ డ్రిల్











**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 7:**కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు సైరన్ మొగ గాని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ఉప్పల్ మండలంలోని మల్లాపూర్ గ్రామం మే ఫ్లవర్ గ్రాండ్ అపార్ట్మెంట్ల సముదాయంలో మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగింది అత్యవసర పరిస్థితులలో ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో మాకు డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు పోలీసు ఫైర్ మెడికల్ హైడ్రా వివిధ శాఖల సంయుక్త సహకారంతో ఈ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఈ మాక్ డ్రిల్ ను పరిశీలించారు

# మే 10న చలో వరంగల్.

## దక్షిణ తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), తేదీ 07-05-2025** బుధవారం రోజున తెలంగాణ ఉద్యమకారుల విభాగం ప్రధాన కార్యాలయం వేములవాడ నందు జరిగిన సమావేశంలో ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి, ఉత్తర తెలంగాణ ఉద్యమ కళాకారుల కోఆర్డినేటర్ బొడ్డు రాములు పాల్గొన్నారు.

అనంతరం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ( టి యు ఎఫ్ ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు ఆదేశానుసారం మే నెల పదో తారీకు శనివారం రోజున మధ్యాహ్నం రెండు గంటలకు ప్రెస్ క్లబ్ హనుమకొండ నందు తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశాలకు వరంగల్, హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, భువనగిరి, నల్లగొండ జిల్లాలకు ఉద్యమకారులు, కళాకారులు, రచయితలు, కవులు, సాహితీవేత్తలు, కళాకారులు తెలంగాణలోని వివిధ జిల్లాల అధ్యక్షులు, కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, మహిళా కళాబృందాల అధ్యక్షురాలు, కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, వివిధ సంఘాల నాయకుల అందరికీ ఇదే మా ఆహ్వానంగా భావించి హాజరు కావలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

అధ్యక్షులు, కన్వీనర్లు పూర్తి బాధ్యత తీసుకొని హనుమకొండ ప్రెస్ క్లబ్ నందు జరుగు రౌండ్ టేబుల్ సమావేశానికి పాల్గొనుటకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వేములవాడ లో 80 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడుతాం.

**రహదారి నిర్మాణంతో భక్తులు, పట్టణవాసులకు ఎంతో మేలు.**
**గజానికి ధర ఎంతో ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేదు.**
**గజానికి 30 వేల ధర నేను ప్రకటించలేదు.**
**భూ సేకరణ చట్టం2013 ప్రకారం నష్టపరిహారం.**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, వేములవాడ వాసులకు ఎంతో మేలు చేకూరే ఆలయ అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ 80 ఫీట్ల వరకు చేయనున్నట్టు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు.

వేములవాడ పట్టణంలోని మూల వాగు నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ, భూ సేకరణ విషయమై కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

మంగళవారం రోజున వేములవాడ పట్టణంలో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో సర్వే చేస్తుండగా పరిశీలించానని, గజానికి ధర ఎంతో తాను ప్రకటించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

వేములవాడ పట్టణంలో 80 ఫీట్ల రోడ్డుకు మార్కింగ్ చేయడంతో పాటు, 315 కుటుంబాలకు భూ సేకరణ చట్టం 2013 ప్రకారం నష్టపరిహారం అంచనా వేసి ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న వారికి గజానికి ధర ఎంతో ప్రభుత్వం నిర్ణయించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం, భూ సేకరణ చట్టం 2013 ప్రకారం అందజేస్తుందని తెలిపారు.

భూ సేకరణ చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని భూ సేకరణ సర్వేలో పొరపాట్లు జరగకుండా పూర్తి చేసి ప్రతిపాదన అందిస్తే వెంటనే అవార్డులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

## భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై స్పందించిన ట్రంప్

న్యూఢిల్లీ మంగళవారం రాత్రి భారత్ చేపట్టిన అపరేషన్ సిందూర్ పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరు దేశాలు ఉద్రిక్తతలు తగ్గించుకోవాలి. ఇరు దేశాల మధ్య పరిస్థితిలు చాలా దారుణంగా ఉన్నాయి.. భారత్, పాక్లు దశాబ్దాలుగా గొడవ పడుతున్నాయి. రెండు శక్తివంతమైన దేశాలు రోడ్లపైకి వచ్చి ఘర్షణ పడాలని ఎవరూ కోరుకోరు. ప్రపంచానికి శాంతి కావాలి.. ఘర్షణలు వద్దని అయన వ్యాఖ్యానించారు.

## ఆపరేషన్ సిందూర్ విజయవంతం.. చందుర్తి లో సంబరాలు.

## చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో యువకుల సంబరాలు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, చందుర్తి, ( ప్రజాబలం ),** బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల ప్రధాన బస్టాండ్ కూడలి వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ఆపరేషన్ సింధూర్ నామకరణం తో పాకిస్తాన్లోని ఉగ్రవాదుల స్థావరాలను, ఉగ్రవాదులను హతమార్చిన భారత సైన్యమును అభినందిస్తూ, భారతదేశ జాతీయ జెండాలతో ప్రధాన రహదారిపై దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మహమ్మద్ అజ్జు మాట్లాడుతూ,పహాల్గం లో పర్యాటకులపై ఉగ్రదాడితో యావత్ దేశం రగిలిపోయిందని పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకోవాలని ప్రతి భారతీయుడు కోరుకున్నట్లే భారత సైన్యం ఉగ్రవాదులను హతం చేసి భారతదేశ సత్తాను మరోసారి చాటిన భారతదేశ సైన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పులి సత్యం గౌడ్, ఫోన్ శెట్టి వెంకటేష్, సీనియర్ క్రీడాకారులు మొహమ్మద్ జాకీర్, మహమ్మద్ హైమద్ పాషా, పులి నారాయణ, ఓరగంటి వెంకటేష్, యువకులు మోతే శివ, హరిబాబు, రాంబాబు, బాల వేణి సంతోష్, మోతే రాజ్ కుమార్, అభి, శ్యామ్, అస్మత్, లవన్ కుమార్, అన్వేష్, సాయి, అప్సర్ పాష, నందు, అజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఏక్తా యాత్ర సన్నాక సమావేశం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్లో నిర్వహించ తలపెట్టిన హిందూ ఏక్తా యాత్ర సన్నాక సమావేశాన్ని వేములవాడ రూరల్ మండలం భారతీయ జనతా పార్టీ పక్షాన ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ బిజెపి మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే హిందూ ఏక్తాయాత్ర ఈ సంవత్సరం మే 22వ తేదీన కరీంనగర్లో సాయంత్రం నాలుగు గంటలకు మొదలవుతుందని ఈ కార్యక్రమానికి వేములవాడ రూరల్ మండలంలోని ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున హిందూ బంధువులు తరలి రావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. సమాజంలో హిందువులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలంటే హిందువులు ఏకతాటి పైకి వచ్చి సంఘటితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోపాటి సురేందర్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు సేవ చేయడమే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లక్ష్యం.

**63,466,80 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఘనత వేములవాడ సొసైటీది.**

**రైతులకు ఇబ్బంది కలిగితే నేరుగా నన్ను సంప్రదించండి.**

**9000277222.**

**ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి.**



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా సొసైటీ పనిచేస్తుందని ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల అంశాలపై డైరెక్టర్లతో చర్చించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల ద్వారా గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, వేములవాడ రూరల్ మండలం అచ్చనపల్లి, బొల్లారం, చెక్కపల్లి, హనుమాజీపేట, లింగంపల్లి, మల్లారం, నమిలి గుండుపల్లి, వేములవాడ అర్బన్ మండలం మారుపాక, వేములవాడ పట్టణం, మున్సిపల్ విలీన గ్రామం శాతరాజు పల్లి, వార్డులలో కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 9వ తేదీన ప్రారంభం చేశామన్నారు. తేదీ06-05-2025 లోపు63 వేల 466,80 వేల వరి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతుల కోసం సహకార సంఘాలు నిరంతరం పనిచేస్తున్నాయని, సోషల్ మీడియా వేదికగా రైతు వరి ధాన్యం సెంటర్ వద్ద వీడియో తీసి సొసైటీని, సిబ్బందిని అగౌరవపరిచే విధంగా మాట్లాడడం బాధ కలిగించిందని, ఆ రైతు 26వ తేదీన వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారని, నెల రోజుల నుండి ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయని మాట్లాడారని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు కాలేదన్నారు. రైతులకు అండగా ఉన్న సొసైటీ పై, సిబ్బందిపై అలా మాట్లాడకూడదని వేడుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్యలు ఏర్పడిన సిబ్బందిని సంప్రదించాలని, అందుబాటులో సిబ్బంది లేకుంటే తనని నేరుగా సంప్రదించవచ్చు అని తెలిపారు. ప్రభుత్వంపై గాని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, అధికార యంత్రాంగం పై రైతులెవరు ఆరోపణ చేయవద్దని, సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయవద్దని కోరారు. సోషల్ మీడియాలో రైతు చేసిన ఆరోపణ ముక్తకంఠంతో పాలకవర్గం ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ లక్ష్మణ్, వైస్ చైర్మన్ లక్ష్మీకాంతరావు, డైరెక్టర్లు తోటరాజు, జేసింత, వెంకటేశం, అమృత, మల్లేశం, సంజీవరెడ్డి, లచ్చిరెడ్డి, సురేందర్ రెడ్డి, బాలవ్వ, రాజయ్య గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 30 మంది ఉగ్రవాదులు హతం

న్యూఢిల్లీ భారత ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' లో ఇప్పటివరకు 30 మంది ఉగ్రవాదులు మరణించినట్లు తెలుస్తోంది. బహవల్పూర్ లోని మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజార్ హెడ్ క్వార్టర్, జైషే మహమ్మద్ కు చెందిన మదర్సాలో ఉగ్రవాదులు ఉన్నారన్న పక్కా సమాచారంతో ఆర్మీ మెరుపు దాడి చేసింది. దీంతో అక్కడ 30 మంది ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. ఇదే విషయాన్ని పాక్ మీడియాలో ధ్రువీకరించినట్లు తెలుస్తోంది.

## మణికొండలో మైనారిటీల ఏకతా సమావేశం

## భారత సైనికులకు మద్దతు.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 7 మే 2025** భారత సాయుధ దళాల పట్ల మద్దతును తెలియజేస్తూ, మణికొండ మైనారిటీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో షేక్ ఆరిఫ్ మహమ్మద్ నేతృత్వంలో మస్జిద్–ఇ–హలీమా నెక్నంపూర్ వద్ద శాంతియుత ఏకతా సమావేశం నిర్వహించ బడింది. ఈ సమావేశంలో ప్రముఖులు తమ ప్రసంగాల్లో దేశ ఐక్యత, మత సామరస్యంపై దృష్టిసారించి, భారత సైనికులకు మద్దతుగా తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ముస్లింలు దేశ అభివృద్ధిలో చేసిన సేవలను గుర్తు చేస్తూ దేశభక్తి సందేశాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఫెడరేషన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. "మతాలు వేరైనా మనమందరం భారతీయులమే అనే సందేశంతో సమావేశం ముగిసింది. ఇందులో ఖుర్షీద్, అల్లాబక్ష్, సలాం సాబ్, హమీద్, అదిల్ భాయ్, అజీముద్దీన్ బైగ్, ఫర్హత్ బైగ్, యూనుస్ భాయ్, షేక్ అల్లాబక్ష్, అజీజ్ సాబ్, జియా సాబ్, ప్రసాద్, లక్ష్మీ ప్రసాద్, డంసాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

## చౌటుకూరు మండల తాసిల్దార్ అనుదీప్





**అందోల్ నియో%జ%జకవర్గం ప్రతినిధి (మే 7 ప్రజాబలం)** అందోల్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన చౌటకూర్ మండలానికి గత 15 రోజుల క్రితం చౌటకూర్ మండల తాసిల్దారుగా నూతన బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ అనుదీప్, ఒక సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధిలోని ఇసోజిపేట,గంగోజిపేట, న్యూ ఓన్నపూర్,తడ్దాన్ పల్లి, ఇలా వివిధ గ్రామాల నుండి మట్టి మాఫియా మట్టిని మైనింగ్ చేస్తూ రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నట్టు,తమ దృష్టికి ఫిర్యాదులు వచ్చాయని, ఇకముందు మండల పరిధిలోని ఇలాంటి సంఘటనలు జరిగితే ప్రజలు తమకు తెలియజేయాలని,అసలే ఎండలు మండుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు బావుల నుండి నీరు సరిగ్గా రాక దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతూ పంటలు పండిస్తున్నారు, ఈ మైనింగ్ మట్టి మాఫియా ఇలాగే కొనసాగితే, భూగర్భ జలాలు మరింత అడుగంటి పోయే ప్రమాదం ఉందని, కావున మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు తాము కూడా బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించి వెంటనే మండల తహసీల్దార్ వారి కార్యాలయంకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## ఏసిపి మాతృమూర్తి భౌతిక కాయానికి

## నివాళులర్పించిన డిసిసి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



**కామేపల్లి ప్రతినిధి మే 07 (ప్రజాబలం)** హనుమకొండ ఏసిపి బానోత్ నందిరామ్ మాతృమూర్తి బానోతు చిట్యాలి (90) అనారోగ్యంతో బుధవారం నాడు వారి స్వస్థలం కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో మరణించారు. వారి భౌతిక కాయాన్ని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు వారి ఆత్మకు ప్రశాంతత చేకూరాలని వారి కుమారులు భాను శ్రీను బానోత్ రాములు బానోతు లచ్చిరాం, బానోత్ నందిరాం ల కుటుంబాలను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు కన్నతల్లి లేని లోటు కుటుంబానికి ఎంతో తీవ్ర మనోవేదనకు గురిచేస్తుందని మల్లి బాబు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ నరసింహ నాయక్, భూక్య నాగేంద్రబాబు పాటిబండ్ల ప్రసాద్, బానోతు లచ్చిరాం, దేరంగుల తిరపయ్య రాయల నాగ శంకర్, భూక్యా వీరన్న, ధరావత్ రవి, బానోత్ లక్ష్మ, బంధువులు మరియు తదితరులు పాల్గొన్నారు

## కలెక్టరేట్లో సదుపాయాలు సౌకర్యాలు పునరుద్ధరించాలి

## జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం ఇచ్చిన టీజీవో నేతలు.




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:గెజిటెడ్ అధికారుల సంఘం,సంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వైద్యనాథ్ మరియు డాక్టర్ సంతోష్ కుమార్ లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ని కలిసి, కలెక్టరేట్ లో ఉన్నటువంటి వివిధ ఆఫీసులలో సౌకర్యాలను పునరుద్దరించాలని మరియు జిల్లాలో గెజిటెడ్ అధికారుల భవనం కోసం పసల్వాడి గ్రామంలో స్థలం కేటాయించినందున,భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మేడం సానుకూలంగా స్పందిస్తూ, త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# జీ నెట్వర్క్ నుండి తెలంగాణ రియల్ హీరోస్ అవార్డ్ గ్రహీత ఇన్స్పెక్టర్ గోపినాథ్ నీ అభినందించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.






**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** గత వర్షాకాలంలో 100 డైల్ కి స్పందించి నిండు ప్రాణాలని కాపాడినందుకు జీ నెట్వర్క్ ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి చేతులమీదుగా తెలంగాణ రియల్ హీరోస్ అవార్డుని అందుకున్న భైంసా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గోపినాథ్ నీ బుధవారం జిల్లా ఎస్పీ అభినందించారు. అనంతరం

భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

షి టీమ్ సిబ్బంది తో కొన్ని కుటుంబ కలహాల కేసులలో ఇరు పార్టీ వారికి కౌన్సెలింగ్ ఇవ్వటం జరిగింది.గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదులను ఇప్పటి వరకు ఎన్ని పరిష్కారం అయ్యాయో పెండింగ్ పిర్యాదుల పురోగతిని గురించి సంబంధిత అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమం లో అవినాష్ కుమార్, ఇన్స్పెక్టర్ లు గోపినాథ్,మల్లేష్, ఎస్ఐ లు శంకర్, గణేష్,షి టీమ్ ఇంచార్జి మహిళా ఎస్ఐ పెర్సిస్,షి టీమ్ సిబ్బంది,క్యాంప్ ఇన్చార్జి రఘువీర్ పాల్గొన్నారు

# నిర్మల్ జిల్లా పెంబి మండలంలో తాగు నీటి సమస్యలపై వందలాది ఆదివాసీలతో ధర్నా టి ఏ జి ఎస్





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం,జిల్లా కమిటీ,నిర్మల్ ఆధ్వర్యంలో పెంబి మండలం గుమేనాకొలం గూడ, (పి వి టి జి) గ్రామం లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ,జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వందలాది ఆదివాసీ గిరిజనులతో గొప్పంగా ధర్నా నిర్వహించారు.

తొడసం శంభు టి ఏ జి ఎస్.కార్యదర్శి మాట్లాడుతూ

గ్రామంలోని ప్రధాన సమస్యలు:

1.తాగు నీటి కొరత: మిషన్ భగీరథ ద్వారా నీటిని అందించాల్సిన అవసరం ఉన్నా, ఇప్పటికీ గ్రామానికి తాగు నీరు అందటం లేదు.గతంలో బోరు వేసి సోలార్ సిస్టమ్ కనెక్ట్ చేసినా,వాటి నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా పనికిరాని స్థితిలో ఉన్నాయి.ప్రజలు ఇంకా తాగు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. 2.ప్రామాణిక సిసిసీ రోడ్ల కొరత, ఇళ్ల నిర్మాణంలో ఆటంకాలు: గ్రామానికి రహదారి సదుపాయాలు లేవు.ఇళ్ల కోసం మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని కూడా అటవీ శాఖ అధికారులుఆటంకం పెడుతున్నారుజివారి అనుమతుల పేరుతో అభివృద్ధి పనులకు అడ్డుపడటం వలన స్థానికులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు.

పూర్వానుభవం: గతంలో ఈ సమస్యలను పరిష్కరించకపోవడంతో గ్రామస్థులు ఎన్నికలను కూడా బహిష్కరించారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం.

ఈ సందర్భంగా సంఘ నాయకులు, ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేశారు సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని విస్తరిస్తామని ప్రకటించారు.

ముఖ్యంగా డిమాండ్ చేస్తున్నవి:

మిషన్ భగీరథ నీటిని తక్షణమే అందజేయాలి.

పాత సోలార్ పంపులను మరమ్మతు చేసి,వాటి నిర్వహణకు పద్ధతి సిద్ధం చేయాలి.

సిసిసీ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులను సమంజసం చేయాలి.

మంజూరైన ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

ఈ ధర్నాలో జిల్లా ఆదివాసీ నాయకులు, టేకం ధర్మరాజు,టేకం భీమ్రావు,ఆత్రం రాజు, ఆత్రం శ్యామ్ రావు, టేకాన్ శ్యామ్ రావు, ఆత్రం సూర్యారావు, గోరి పెద్దయ్య,కొమరం భీమ్రావు, టేకంనాగారావు, కస్తూరి అర్జున్,గ్రామ పటేల్యువజన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఉగ్రవాదానికి సమాధానంగా ఆపరేషన్ సింధూర్ ను చేపట్టిన భారత సైన్యానికి సెల్యూట్ బి.జె.ఎల్.పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ ను చేపట్టడం అభినందనీయం. పాకిస్తానులోని మూడు ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది శిబిరాల్లో దాక్కున్న టెర్రరిస్టులను పెద్దసంఖ్యలో ఆపరేషన్ సింధూర్ ద్వారా హతమార్చిన భారత సైన్యానికి అభినందనలు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఏరివేతకు భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ ను చేపట్టడం పట్ల దశప్రజలంతా గర్వపడుతున్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేసేలా చర్యలు తీసుకోవాలంటూ సైన్యానికి ఆదేశిచాడం ద్వారా భారత ప్రధాని మోదీ గారు తీసుకున్న సాహసోపేత నిర్ణయం ప్రపంచానికే దిక్సూచిగా నిలువనుంది. భారతీయులకు హాని తలపెట్టాలని చూసే దుష్ట శక్తులను మోదీ ప్రభుత్వం ఎట్టి పరిస్దితుల్లోనూ వదిలిపెట్టదని,వాటి అంతు చూస్తుందని ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రధాని మోదీ గారు మరోసారి నిరూపించారు. ఆత్మగౌరవ భారత్ ను, దుర్భేధ్య భారత్ ను తన సమర్ధ నాయకత్వం ద్వారా ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ గారికి,భారత సైన్యానికి మనస్పూర్తిగా అభినందనలు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఏరివేతకు దిగిన భారత సైన్యానికి,ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ గారికి అండగా దేశప్రజలంతా నిలబడాల్సిన సమయమిది. జయహొ భారత్.జై హింద్

# 9వ భరోసా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## పొక్సో, అత్యాచార కేసులలో మహిళల, బాలికల భద్రతకు "భరోసా" పెద్దపీట.

## భరోసా సెంటర్ సేవలు మరువలేనివని, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ. పరితోష్ పంకజ్ ఐపిఎస్




సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:భరోసా 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లాలో భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొక్సో మరియు అత్యాచార కేసులలో భాదితురాలికి భరోసానిచ్చేందుకు తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా 2016 మే 7వ తేదీన ఉమెన్ సేఫ్టీ వింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని, అప్పటి నుండి ఇప్పటి వరకు పొక్సో మరియు అత్యాచారకేసులలో భాదిత మహిళల, బాలికల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటూ మన భరోసా సేవలు దేశానికే ఆదర్శం అని ఎస్పీ అభిప్రాయపడ్డారు,మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని రకాల సేవలను ఒకే గొడుగు క్రింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో భరోసా కేంద్రాన్ని తేది: 28.09.2020, నాడు ప్రారంభించడం జరిగిందన్నారు,ఈ భరోసా సెంటర్ నందు శిక్షణ పొందిన సిబ్బంది, భాదిత మహిళలను అక్కున చేర్చుకొని వారిలో కొండత ధైర్యాన్ని నింపుతూ సమస్యలతో భరోసా సెంటర్ కు వచ్చిన వారికి నిష్ణాతులైన కౌన్సర్ లచే కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, అన్ని రకాల సేవలు (మెడికల్, లీగల్ మరియు కాంపెన్సేషన్) ఒకే వేదికగా అందిస్తూ, భాదితులకు బాధ నుండి విముక్తి కల్పిస్తూ సత్వర న్యాయం చేకూరేలా సేవలందిస్తున్న భరోసా సిబ్బంది సేవలు అభినందనియమని వారి సేవలను కొనియాడారు. భరోసా సెంటర్ ద్వారా పోక్సో మరియు మహిళల పై అత్యాచార కేసులను నియంత్రించడానికి స్కూల్, కళాశాల లలో తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. పోక్సో కేసు నమోదు అయినప్పటి నుండి చివరి వరకు బాధితులకు అండగా వుంటూ, నేరస్తులకు శిక్ష పడేలా చేయడమే భరోసా ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. తమకు జరిగిన అన్యాయం గురించి నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు నమోదు చేయాలని, న్యాయస్థానం ముందు దోషులకు శిక్ష పడినప్పుడే తిరిగి నేరం చేయడానికి వెనకడుగు వేస్తారని అన్నారు,భాదిత మహిళలకు విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ క్రింద ఒక్కొక్కరికి రూ: 5వేల చొప్పున, 20 వేల చెక్కులను అందించడం జరిగిందని ఎస్పీ అన్నారు,భరోసా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, రాత్రి పగలు అని తేడా లేకుండా ఎల్లవేలలా పిల్లల, మహిళల రక్షణకు అందుబాటులో ఉండాలని సూచించారు.బాధితులకు ఎలాంటి అసౌకర్యం కలగనీయకుండా అన్ని శాఖల అధికారులతో కో–ఆర్డినేషన్ తో విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో భరోసా సెంటర్ ప్రారంభమైన నాటి నుండి సత్ ఫలితాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న భరోసా కో–ఆర్డినేటర్ దేవలక్ష్మీ, సిబ్బందిని, ఎస్పీ అభినందించారు,ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంబడి మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐ పూలబాయ్, భరోసా సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆపరేషన్ సింధుర్ కు సంగారెడ్డి బార్ అసోసియేషన్ మద్దతు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:జమ్ము కాశ్మీర్లోని పహాల్గంలో ఉగ్రవాదులు చేసినటువంటి దాడిని ప్రతికారంగా మన భారతదేశ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆర్మీ జవాన్లు చేసిన ఆపరేషన్ సింధుర్ కార్యక్రమానికి మద్దతుగా సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా పాకిస్తాన్ బుద్ధి తెచ్చుకొని శాంతియుతంగా ఉండాలని అన్నారు. లేదంటే భారత భారత పౌరులు అందరూ పాకిస్తాన్ పై యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని భారతీయులందరూ కలిసి దాడి చేసే పాకిస్తాన్ పూర్తిగా ఒక రోజులోనే నాశనం అవుతుందని అని అన్నారు అలాగే ఉగ్రవాదుల మద్దతుదారులు కొంతమంది భారతదేశంలో ఉన్నటువంటి వారు ఉన్నపలంగా దేశాన్ని వదిలి వెళ్లాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మహేష్ కార్యవర్గ సభ్యులు బుచ్చయ్య, సుభాష్ చందర్, మాణిక్ రెడ్డి మరియు దత్తాత్రి సీనియర్ న్యాయవాదులు మరియు సంగారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఇబ్బందులు పడలేక... ఊరికి వెళ్ళలేక... సమస్యలు వలయంలో కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ వాసులు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/పటాన్ చేరు:ఇండ్లొచ్చిన ఆనందం మరిచి సమస్యలతో సావాసం చేస్తున్న పేదలు సరిపోను మంచినీటి సదుపాయం లేక తీవ్ర అవస్థలు పిల్లల కోసం సదువుకునే సదుపాయం... ప్రమాదం, ప్రసూతి అవసరాలకోసం హాస్పిటల్ లేదు రవాణా సదుపాయం, ఉపాధి లేక నిత్యం నరకయాతన నిర్మాణం సరిగా లేక మెయింటనేన్స్ కోసం నెల నెలా చందాలు వేసుకుంటున్న పేదలు సదుపాయాలు లేక ఇబ్బందులు పడలేక ఊరెళితే ఇంటినీ ఖాళీ చేస్తామని అంటున్న అధికారులు,సిపిఎం పర్యటనలో తమ బాధలను చెప్పుకున్న డబుల్ బెడ్రూం వాసులు సమస్యల పరిష్కారం అయ్యే వరకు ఎర్రజెండా చేతబట్టి పోరాడుదాం సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు నేడు కొల్లూర్ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పరిశీలన

కార్యక్రమంలో సిపిఎం నాయకులు వాజీద్ అలీ,యం.నర్సింలు, నాగేశ్వరావు, కృష్ణ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com